


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 10-02-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 130 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## పరిష్కారమైన పంచగ్రామాల సమస్య



సింహాచలంః ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పంచ గ్రామాల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించిందని రాష్ట్ర మానవ వనరుల శాఖమంత్రి గంటా శ్రీనివాసరావు తెలి పారు. శనివారం మంత్రి ఈ విషయమై సర్క్యూట్ హౌస్‌లో పాత్రికేయులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంచ గ్రామాల భూముల

తరువాయి 2లో..

## పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాం

### జనసైనికుల ప్రమాణ స్వీకారం



విశాఖపట్నంః రాష్ట్రం, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు రెండూ రాష్ట్రాన్ని నిలువునా చీల్చి ఏపీ ప్రజలకు అన్యాయం చేశారని, విభజన సమస్యలపై ప్రత్యేక హెూదా ఇస్తామని చెప్పి మోసం చేశారని జనసైనికులు విమర్శించారు. ఇటీవల నియమితులైన పార్టీ పార్లమెంటరీ కమిటీ సభ్యులు నగరంలోని అక్కయ్యపాలెం పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రతినిధుల చేత మాజీ వైస్ ఛాన్సలర్ కె.ఎస్. చలం ప్రమాణ స్వీకారం చేయించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సూచించిన మేరకు విశాఖ జిల్లాకు చెందిన ముఖ్యులకు ఈ పదవులు కట్టబెట్టారు. ప్రతీ పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా భావించి కమిటీలను నియమించడం జరిగింది. రీజనల్ కార్యదర్శిగా కోన తాతారావు, కార్యదర్శిగా బొలిశెట్టి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం. రాఘవరావు, డా. బొగ్గు శ్రీను, తిప్పల రమణారెడ్డి, గడసాల అప్పారావు, అలివర్‌రాయ్ నియమించారు. వైస్ చైర్మన్‌గా శివప్రసాద్, కోశాధికారిగా తోట సత్యనారాయణ, అధికార ప్రతినిధిగా ప్రవీణ్ బాబు, ముసలయ్యలకు అవకాశం కల్పించారు. సిటిజన్ కౌన్సిల్‌కు నందమూరి రామకృష్ణ, న్యాయ విభాగానికి మార్కండేయను నియమించారు. వీరు కాకుండా ఎగ్జిక్యూటివ్ కమిటీలో 11 మందికి, వర్కింగ్ కమిటీలో 32 మందికి స్థానం కల్పించారు.




## మేము ఓటు బ్యాంకు రాజకీయాలు

# నమ్మబోము

### భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా



పూణె: తమ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేయదని భారతీయ జనతా పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని పూణెలో పార్టీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని ఇప్పటివరకు 55 నెలలు పరిపాలించారు. 55 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ సాధించలేనిది సాధించడానికి ప్రయత్నించారు. మేము ఓటు బ్యాంకు రాజకీయాలను నమ్మబోము. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఒకే ర్యాంకు ఒకే పెన్షన్ పథకాన్ని అమలు చేసింది. 55 ఏళ్లు అంటే చాలా అధిక సమయం. ఇన్నేళ్లు పాలించినప్పటికీ దేశంలో మార్పును తీసుకురాలేకపోయారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా యాత్రలు చేపడితే శాంతి, భద్రతల సమస్య ఏర్పడుతుందని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. నిన్న ఓ ఛానెల్ స్టింగ్ ఆపరేషన్ చేసి, ఓ విషయాన్ని తేల్చింది. అసలు శాంతి, భద్రతల సమస్య తలెత్తే అవకాశమే లేదని, భాజపాకు మమతా బెనర్జీ భయపడుతున్నారని,

తరువాయి 2లో..

## ఏప్రిల్ 20నుంచి ఏపీ ఎంసెట్

AP EAMCET

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎంసెట్ పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణ బాధ్యత జేఎన్‌టీయూ కాకినాడ చేపట్టనుంది. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను శనివారం విడుదల చేశారు. ఏప్రిల్ 20 నుంచి 23 వరకు ఇంజినీరింగ్ విభాగా నికి, 23, 24 తేదీల్లో అగ్రికల్చర్ విభాగాలకు పరీక్షలు నిర్వహించ నున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒక బ్యాచ్‌కు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30గంటల వరకు మరో బ్యాచ్‌కు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నెల 20న

తరువాయి 2లో..

## గ్లోబల్ సిటీగా మార్చేందుకు హైదరాబాద్‌పై ప్రణాళికలు సిద్ధం

- కేశవాపూర్ జలాశయం నిర్మాణానికి శంకుస్థాపన!
- మాస్టర్ ప్లాన్‌ను ఉల్లంఘించరాదు
- ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ సమీక్ష



హైదరాబాద్: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులకు సూచించారు. ప్రగతిభవన్‌లో ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బృహత్ ప్రణాళికలో మంత్రివర్గం మినహా మరెవరూ మార్పులు చేయకుండా చట్టం చేస్తామని స్పష్టం చేశారు. హెచ్‌ఎండీఏ, వివిధ రంగాలకు చెందిన నిష్ణాతులతో ప్రాధికార సంస్థ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. జీహెచ్‌ఎంసీ నిధులపైనే ఆధారపడకుండా ఇతర నిధులు కూడా సమకూరుస్తామని తెలిపారు. నగరాన్ని 3 యూనిట్లుగా విభజించి 3 నెలల్లో బృహత్

తరువాయి 2లో..

## జోన్-1 కార్యాలయానికి శంకుస్థాపన

### మంత్రి గంటా శ్రీనివాస రావు పర్యటన



మధురవాడః శనివారం భీమిలి నియోజకవర్గంలో పర్యటించి ఐదవ వార్డువార్డు పరిధి మధురవాడ లా కాలేజ్ సమీపంలో 12 కోట్ల రూపాయల ఖర్చుతో జోన్ 1 నూతన కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు, అనంతరం అక్కడ నుంచి మధురవాడ వాంబే కాలనీకి చేరుకొని కాలనీలో ఉన్న 2,430. ఇళ్ల మరమ్మతుల పని నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిన 5 కోట్ల 36 లక్షల 61 వేయి రూపాయలతో పనులకు శిలాఫలకం ఆవిష్కరించారు,

తరువాయి 2లో..

## మోదీ గో బ్యాక్.. ఏపీలో నిరసనలు

అమరావతి: ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో ఏపీ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలంటూ నిరసనలు తెలియజేస్తున్నారు. మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలతో నల్ల జెండాలతో పలు చోట్ల ఆందోళనలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈ నిరసనలు కొనసాగుతున్నాయి.

ప్రధాని పర్యటించనున్న గుంటూరు నియోజకవర్గంలో నిరసనలు ఉగ్రరూపం దాల్చాయి. రాష్ట్రానికి ద్రోహం చేసిన మోదీ ఏపీలో అడుగు పెట్టవద్దని తెదేపా నేతలు స్పష్టం చేశారు. మోదీని ప్రజలు స్వాగతించరని తెలుగు యువత నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయవాడ లెనిన్ కూడలిలో వామపక్ష నేతలు నిరసనకు

తరువాయి 2లో..



# అంబరాన్ని అంటిన కశింకోట గౌరీ పరమేశ్వరుల సంబరం

## దర్శించుకున్న ప్రముఖులు

అనకాపల్లి : మండల కేంద్రమైన కశింకోట గ్రామంలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం, ఎంపీ అవంతి శ్రీనివాస్, ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, ఆర్ఈసిఎస్ చైర్మన్ మలసాల రమణారావు, ఎంపిపి పంచదార్ల లక్ష్మి, డాక్టర్ సత్యవతి, విష్ణుమూర్తి, డిఎస్పీ ప్రసాద్, సిఐ రామచంద్రరావు, కశింకోట జనసేన నాయకులు ఉత్తాడ రామరాజు తదితరులు గౌరీ పరమేశ్వరుల్ని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వీరికి ఉత్సవ కమిటీ అధ్యక్షులు వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీష్, ఆడారి నర్సింగరావు, తదితరులు స్వాగతం పలికి మేళతాళలతో తోడ్కొని వెళ్లి పూజలు చేయించి ప్రసాదాన్ని అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. సాయంత్రం ఐదు గంటల నుండి ఈసందర్భంగా ఆలయానికి భక్తులు పొటెత్తారు. సాయంత్రం ఐదు గంటల నుండి గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవం సందర్భంగా కశింకోట ప్రాంతమంతా సందడిగా కనిపించింది. చుట్టు ప్రక్కల ప్రాంతాలనుండి బంధువుల ఇళ్లకు వస్తున్న వాహనాలతో రోడ్లన్నీ సందడిగా మారాయి. ఉత్సవంలో భక్తులకి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవంలో పలు సేవా కార్యక్రమాలు ....గౌరీ పరమేశ్వరుల



ఉత్సవానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్ధం జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం ఆద్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా భక్తులకు ఉచితంగా అల్పాహార విందు ఏర్పాటు చేసారు. అలాగే భారీ స్టేజ్ ప్రోగ్రాన్ని ఏర్పాటు చేశారు.

# కెనరా బ్యాంక్ పొదుపు, కరెంటు ఖాతాల మేళా




అచ్యుతాపురం : కెనరా బ్యాంక్ పొదుపు, కరెంటు ఖాతాల మేళాను ఉపయోగించుకొని అతి తక్కువ వడ్డీకే రుణాలు పొందవచ్చునని కెనరా బ్యాంక్ అధికారులు చిరంజీవి ,హేమంత్ అన్నారు .శనివారం మండలంలో దుప్పితూరు శివారు ముసలమ్మపాలెం గ్రామంలో రైతులకు కెనరా బ్యాంక్ పొదుపు, కరెంటు ఖాతాల పై బ్యాంక్ అధికారులు అవగహన కల్పించారు .బంగారంపై అతి తక్కువ వడ్డీ 33 పైసలకే రుణాలు పొందవచ్చన్నారు .ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం శాఖ హెరిటెజ్ డెయిరి మేనేజర్ కూండ్రపు శేషు ,కె అర్జునరావు ,కె రాజుబాబు ,ప్రసాద్ ,అరుణ , సన్నిబాబు ,కుమారి ,రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్‌పై ఆసక్తి కలిగించడంలో జెవివి కృషి అభినందనీయం

## జెవివి సైన్స్ సంబరాలు ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి చినరాజప్ప



పెద్దాపురం : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంశాఖమాత్యులు నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్‌లో జరుగుతున్న చెకుముకి సైన్స్ సంబరాలు జెవివి రాష్ట్ర అధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి అధ్యక్షతన ప్రారంభ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షలమంది చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనడం చాలా ఆనందదాయకమని అన్నారు. మధ్యాహ్నం విద్యార్థులతో మీట్ సైంటిస్ట్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్స్ ఎ.రామచంద్రయ్య, ఎన్.వేణుగోపాలరావు, సుబ్రహ్మణ్యం, మూటారి కృష్ణ ప్రసాద్, కె.ఎల్.కాంతారావు, కె.శ్రీనివాస్ విద్యార్థులతో కలిసి మాట్లాడారు.

# తిమ్మరాజుపేట మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి



అనకాపల్లి : గ్రామ కంఠానికి చెందిన ఆక్రమణ భూములను స్వాదీనం చేసుకుని గ్రామస్థులకు న్యాయం చేయాలని, డిమాండ్ చేస్తూ ఆర్డీవో ఎం.వి సూర్యకళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకుడు కొయిలాడ శివాజీ మాట్లాడుతూ గ్రామంలో సర్వే నెంబరు 23 లో 70 సెంట్లు విస్తీర్ణంగల మాలల బంద (చెరువు)ను మాజీ సర్పంచ్ శరగడం వెంకటజగన్నాధరావు, కబ్జాచేసి విక్ర యించుకున్నారని, ఆరోపించారు. సుమారు రెండు కోట్ల 80లక్షల రూపాయలు విలువైన గ్రామానికి చెందిన భూమిని విలువైన భూమిని ఆక్రమించుకుని అమ్మకాలు జరిపిస్తున్నారని, తక్షణమే అడ్డుకోవాలని, వారు అన్నారు. ఈ మేరకు గ్రామంలో ర్యాలీ ఎమ్మార్వో కార్యా లయం ముందు ఆందోళనలు నిర్వహించామని దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. 23 గా సర్వే నెంబరు 1 చేర్చి తప్పుడు ధృవీకరణ పత్రాలను సృష్టించి ఈ భూమిని విక్రయిస్తున్నారని, అందుకు ప్రోత్సహించిన సెక్రటరీని విచారించాలని ఆమెను కోరారు. ఇప్పటికే పెంటకోట సునీతాకు రెండు సెంట్లు, కాండ్రేగుల గణేష్ వెంకటప్పారావుకు 3 సెంట్లు, సూరిశెట్టి సూరిబాబుకు 3 సెంట్లు, శరగడం వెంఖటరమణకు 14 సెంట్లు, మద్దాల అప్పలనాయుడుకు 9 సెంట్లు, మళ్ల శ్రీరాములకు 9 సెంట్లు, శరగడం వెంకట జగన్నాధరావుకు 21 సెంట్లు విక్రయించినట్లు డాక్యుమెంట్లు ఉన్నాయని ఆరోపించారు. గ్రామకంఠం భూమిని వ్యక్తులు స్వార్ధ ప్రయోజనాలకు గురికాకుండా గ్రామస్తులందరికీ సామూహికంగా ఆ భూమిని ఉపయోగపడే విదంగా, ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు.

# జనసేన ప్రాంతీయ కమిటీ కార్యదర్శిగా లోకం మాధవి



విజయనగరం : జనసేన వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీల నియామకాన్ని చేపట్టారు. కమిటీకి ప్రాంతీయ కార్యదర్శిగా లోకం మాధవి, కార్యదర్శిగా గెదెల శ్రీనుబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బడన దేవభూషణ రావు, పెద్ది వెంకటేష్, కోశాధికారిగా పదశ్రీదాస్, ల నియామం జరిగింది. అలాగే కార్వర్గ సభ్యులుగా తమ్మినేని శ్రీనివాస్, పైలా మహేష్, ఈశ్వరరావు, కలిదిండి మురళీరాజు, ఉర్లాపు పోలరాజు, లంక రమేష్, పాండ్రంకి అప్పారావు, త్యాడ రామకృష్ణారావు, తలచుట్ల రాజీవ్‌కుమార్, వర్కింగ్ కమిటీ సభ్యులుగా..సైదల జగదీశ్, సేతేటి శ్రీను, పాగిరి శివ, జరజాపు శ్రీధర్, వడ్డిపల్లి శ్రీనివాసరావు, మధుసూధనరావు, పెద్దాడ గురివినాయుడు, హేమసుందర్ నియమితులైయ్యారు.

# నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించక తప్పదు

విజయనగరం: అతివేగం..నిర్లక్ష్యం ప్రమాదాలకు మూలమని జిల్లా అదనపు జడ్జి ఏ.వరప్రసాద్ అన్నారు. రోడ్డుబద్రతావారోత్సవాల్లో భాగంగా జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఎం.శ్రీహరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తప్పనిసరిగా నియామావళి పాటించాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. అలా ఇచ్చిన తల్లిదండ్రులు కూడా శిక్షకు అర్హులేనని తెలిపారు. శుక్రవారం వారోత్సవాల్లో భాగంగా స్థానిక మయూరి కూడలిలో రవాణా ప్రాంతీయ అధికారి భువనగిరి కృష్ణవేణి, ఆర్టీఓ మురళీకృష్ణ, మాదవ తదితరులతో పలువురు వాహనచోదకులు పోలీసులు రవాణాసిబ్బందితో మానవహారం నిర్వహించారు. సుమారు అర్ధగంట కాలం జరిగిన ఈ కార్యక్రమం వల్ల వాహనదారులకు, ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై అవగాహన కల్గించేందుకు కూడలి చుట్టూ ఫ్లెక్సీలు తదితర ప్రచార సామగ్రిని ప్రదర్శించారు. అనంతరం గద్దె వరప్రసాద్ బృందంచే రోడ్డు ప్రమాదాల నేపథ్యంతో సాగిన వీధినాటక ప్రదర్శన ఆసక్తికరంగా సాగింది.

# శాంతియుతంగా ఎన్నికలు నిర్వహిస్తాం : జిల్లా నూతన ఎస్పీ ఎ.ఆర్. దామోదర్



విజయనగరం : జిల్లా ఎస్పీగా ఎ.ఆర్. దామోదర్ విశాఖపట్నం రేంజ్ డిఐజి జి. పాలరాజు గారి నుండి జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ గారు మాట్లాడుతూ - తనకు జిల్లా పట్ల పరిజ్ఞానం ఉందన్నారు. గతంలో తాను విశాఖపట్నం రూరల్‌లో ఒఎస్‌డిగా పనిచేసినట్లు, రాబోయే ఎన్నికలను జిల్లాలో శాంతియుతంగా, నిష్పక్షపాతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఉత్సాహం, యువకులైన పోలీసు అధికారులుఉన్నారని, వారితో గతంలో పనిచేసిన అనుభవం కూడా ఉందన్నారు. జిల్లాలో ఏవిధమైన మావోయిస్టు కార్యకలాపాలు గత మూడు సం॥లుగా జరగలేదని, ఎటువంటి కేసులు నమోదు కాలేదన్నారు. జిల్లాలో నేరాలు నమోదయ్యే రేటు ఇతరజిల్లాల కంటే తక్కువగానే ఉందని, కేసులను తాను ఒకసారి సమీక్షించి, వాటి సంఖ్యను మరియు నాన్ బెయిలబుల్ వారంట్లును మరింతగా తగ్గించేందుకు కృషి చేస్తానన్నారు. శాంతియుతంగా ఎన్నికలను నిర్వహించేందుకు పోలీసుశాఖకు ప్రజలు, మీడియా సహకరించాలని కోరారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగేందుకు అవకాశం ఉన్నట్లుగా ముందస్తు సమాచారం ఉంటే నేరుగా సంబంధిత అధికారులకు సమాచారం అందించవచ్చునన్నారు. జిల్లా ఎస్పీగా పనిచేసి, విశాఖపట్నం రేంజ్ డిఐజిగా ఉన్న పాలరాజు గారి పర్యవేక్షణలో ప్రజలకు పోలీసుశాఖను మరింత చేరువ చేస్తానన్నారు. అనంతరం, జిల్లాలో ప్రధానంగా నమోదవుతున్న కేసులు, శాంతి భద్రతల సమస్యలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎ.ఆర్. దామోదర్ గార్ని అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, ఒఎస్‌డి జె రామ్మోహనరరావు, బబ్బిలి ఎఎస్పీ గౌతమీ శాలీ, పార్వతీపురం ఎఎస్పీ సుమిత్ గరుడ, విజయనగరం డిఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్, ఎస్‌బి డిఎస్పీ సి. మురళీ నాయుడు, ట్రాఫిక్ డిఎస్పీ ఎం. శ్రీనివాసరావు, ఎస్సీ ,ఎస్టీ సెల్-2 డిఎస్పీ గురుమూర్తి, సిసిఎస్ డిఎస్పీ పాపారావు, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, సిఐలు జి. రామకృష్ణ, వై.వి. శేషు, రంగనాధం, మోహనరావు, రాంబాబు, ఆర్. శ్రీనివాస రావు, రాజుల నాయుడు ఆర్ఐలు శ్రీహరిరావు, రామకృష్ణ,రమేష్, శంకరరావు, కమ్యూనికేషన్ సిఐ రమణ మూర్తి మరియు ఇతర పోలీసు అధికారులు కలసి, పుష్ప గుచ్ఛంలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# జోన్-1 కార్యాలయానికి శంకుస్థాపన



అనంతరం ఆ కాలనీలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి గంట శ్రీనివాస రావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే భీమిలి నియోజకవర్గం అభివృద్ధిలో ముందు ఉండాలని, ఏ ఒక్క అభివృద్ధి పని మిగిలి ఉన్న వాటన్నిటినీ పూర్తి చేయాలని కూడా దృఢ నిశ్చయంతో ఉన్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోరి భీమిలి నియోజకవర్గంలో ఉన్న అన్నా క్యాంటీన్లలో ఇప్పటికే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం ప్రతిరోజూ ఉచితంగా అందిస్తున్నామని, ఇది ఒక మన



భీమిలి నియోజకవర్గంలో మాత్రమే ఇస్తున్నామని అన్నారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా మంచి నీటి సమస్య ఉంది దీనిని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి రెండు మూడు రోజులలో శాశ్వత పరిష్కారం చేసి నీటి కొరత లేకుండా చూస్తామని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కరించేందుకు 27 రకాల పనులకు 7 కోట్ల 36 లక్షల 28 వేలు రూపాయలు విడుదల చేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని అవసరాలు తీర్చే విధంగా తెలుగుదేశం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేసిందని అన్నారు. అనంతరం చంద్రపాలెం ఉన్నత పాఠశాలలో పైలాన్‌ను ప్రారంబించారు, క్రొత్తగా తరగతి గదులకు పలు సౌకర్యాలు కల్పించేందుకు శంకుస్తాపన చేశారు. విద్యార్థినులకు సైకిళు ఇచ్చారు, ఈ కార్యక్రమంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరి నారాయణన్ , జోన్ 1 కమిషనర్ బి. సన్యాసినాయుడు, టి.డి.పి. భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ చిక్కాల విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పరిష్కారమైన పంచగ్రామాల సమస్య

సమస్యతో వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతుండటాన్ని ప్రభుత్వం గుర్తించి మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. తదుపరి ఈ సమస్యను అసెంబ్లీలో చర్చించి ప్రత్యేక చట్టం తేవడం ద్వారా పరిష్కారం చూపడం జరిగిందన్నారు. దీని వలన ఆ ప్రజలకు ఒక భద్రత, ఒక భరోసాను ప్రభుత్వం యిచ్చిందన్నారు. జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టర్, సింహాచలం దేవస్థానం ఇఓలతో ముగ్గురు సభ్యుల కమిటీ, ఈ విషయంపై గజిట్ నోటిఫికేషన్ రాగానే తదిపరి చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఎంఎల్ఎ గణబాబు మాట్లాడుతూ జటిలమైన సమస్యను పరిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లా యంత్రాంగం కూడా ఈ సమస్య పరిష్కారానికి కృషి చేసిందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలక్టరు భాస్కర్, ఎంఎంఎలు బంగారు సత్యనారాయణ, పంచకర్ల రమేష్ బాబు. టిడిపి 72వ వార్డు ప్రెసిడెంట్ పిసిని వరాహ నరసింహం, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కర్రి స్వామి, సీనియర్ నాయకులు ముషిడి శంకరరావు, నారవల అప్పారావు, మేక కాసు, గోపాల్, తదితర టిడిపి నా/యకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మేము ఓటు బ్యాంకు రాజకీయాలు నమ్మబోము

అందుకే తాము అటువంటి నివేదిక ఇచ్చామని ఓ అధికారి చెప్పారు అని వ్యాఖ్యానించారు. దేశంలోని ఇతర అన్ని పార్టీల కన్నా భాజపా భిన్నమైంది. ఈ పార్టీ కార్యకర్తల పార్టీ.. నాయకుల పార్టీ కాదు. బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు ప్రదర్శిస్తున్న పనితీరే భాజపా విజయాలకు కారణాలు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి పనులే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను మళ్లీ గెలిపిస్తాయి. పశ్చిమ బెంగాల్, ఒడిశాల్లోనూ మనం విజయాన్ని సాధించబోతున్నాం. రైతుల సంక్షేమం కోసం వారికి ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.6000 చొప్పున అందించాలని నిర్ణయం తీసుకుని, బడ్జెట్‌లో ఇందుకు నిధులు కేటాయించారు. దేశ సరిహద్దుల్లో సమర్థవంతంగా భద్రతను కొనసాగిస్తున్నాం. బడ్జెట్‌లో ఇందుకోసం అత్యధికంగా నిధులు కేటాయించాం. మళ్లీ అధికారంలోకి వస్తే చొరబాటుదారులను తొలగిస్తాం. మేము ఓటు బ్యాంకు రాజకీయాలు చేయబోము. దేశ భద్రతే మాకు ముఖ్యం అని అమిత్ షా తెలిపారు.

# ఏప్రిల్ 20నుంచి ఏపీ ఎంసెట్

ఏపీ ఎంసెట్-2019 నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మార్చి 27వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు గడువు ఇవ్వగా, రూ.500 అపరాధ రుసుముతో కలిపి ఏప్రిల్ 4 వరకు, రూ.1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 9, రూ.5వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 14, రూ.10వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 19 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 16 నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు. మే 5న ఎంసెట్ పరీక్ష ఫలితాలు వెల్లడించనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

# గ్లోబల్ సిటీగా మార్చేందుకు హైదరాబాద్‌పై ప్రణాళికలు సిద్ధం

ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కేశవాపూర్ జలాశయం నిర్మాణానికి ఈనెలలోనే శంకుస్థాపన. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ప్రధాన నగరం అవతలికి తరలించాలి. దిల్లీ, బెంగళూరు, బీజింగ్ వంటి నగరాలు ఇప్పుడు జనజీవనానికి అనువుగా లేవు. ఇప్పటికి హైదరాబాద్ పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ భవిష్యత్ దృష్ట్యా జాగ్రత్త పడాలి. మంచినీరు, డ్రైనేజి, ట్రాఫిక్, విద్యుత్ వంటి అంశాల్లో పరిస్థితిని అంచనా వేయాలి. విద్య, వైద్యం, క్రీడలు, సినిమా వంటి అంశాలకు ప్రత్యేక ప్రాంతాలు గుర్తించాలి. మాస్టర్ ప్లాన్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఉల్లంఘించడానికి వీల్లేదు. ఒకప్పుడు హైదరాబాద్ స్వర్గంలా ఉండేది. ముత్యాలు, సరస్సులు, ఉద్యానవనాలతో భాగ్యనగరం నిండిఉండేది అని సీఎం వివరించారు.

# మోదీ గో బ్యాక్.. ఏపీలో నిరసనలు

దిగారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన మోదీ రాష్ట్ర పర్యటనకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నించారు. మోదీ పర్యటనను అడ్డుకుని తీరుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు తెలిపారు. మోదీ పర్యటనను నిరసిస్తూ కడప జిల్లాలో మట్టి, నీళ్ల కుండలతో వామపక్షాలు వినూత్నంగా నిరసన తెలిపాయి. కర్నూలు జిల్లా కోడుమూరులో తెదేపా, వామపక్షాల నేతలు కలిసి ఆందోళనలు చేపట్టారు. గన్నవరం విమానాశ్రయం నుంచి గుంటూరు వెంబడి రహదారిపై పెద్ద ఎత్తున మోదీకి వ్యతిరేకంగా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు మోదీ పర్యటన పట్ల శాంతియుతంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

# రాష్ట్ర కమిటీలో పలక రవికి స్థానం

## వైసిపి శ్రేణులు, రవి అభిమానుల హర్షాతిరేకం



అనకాపల్లిః అనకాపల్లికి చెందిన వైసిపి యువనాయకులు పలక రవికి ఆ పార్టీ రాష్ట్ర కమీటీలో స్దానం లభించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అతనిని రాష్ట్ర యువజన విభాగం కార్యదర్సిగా నియమిస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. త్వరలోనే సదరు ఉత్తర్వులను రవి అందుకోనున్నారు. పలక రవికి రాష్ట్ర కమిటీలో స్దానం లభించడం పట్ల వైసిపి శ్రేణులు రవి అబిమానులు, హర్షం వ్యక్తం చేసారు.

# రాష్ట్రంలో 4 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు



నాతవరం: రాష్ట్రంలో 4లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేయడం సంతోషకరమైన విషయమని మంత్రి అయ్యన్న సతీమణి చింతకాయల పద్మావతి అన్నారు. శనివారం నాతవరంలో సామూహిక గృహాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఎన్టీఆర్ నూతన గృహ ప్రవేశ మహోత్సవాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రంలో 4లక్షల ఇళ్ల గృహ ప్రవేశాలు సామూహికంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు, జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, తాండవ జలాశయ చైర్మన్ పారుపల్లి కొండబాబు, టీడీపీ నాయకులు తదితరుల పాల్గొన్నారు.

# మత్స్యకారులకు అండగా ఉంటాం

**పెతాయ్ తుపాన్ బాధితులను ఆదుకుంటాం .. మునిగిన బోట్లకు త్వరలోనే పరిహారం**

**ఎమ్మెల్యే వాసుపల్లి చొరవతో .. మునిగిన బోట్లను బయటకు తీసిన పోర్టు వర్గాలు**



విశాఖపట్నం: పెతాయ్ తుఫాన్లో నష్టపోయిన మత్స్యకారులను ఆదుకుంటామని మునిగిన మరబోట్లకు త్వరలోనే పరిహారం అందజేసి ఆదుకుంటామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఓ ప్రకటనలో భరోసా అందించారు. పెతాయ్ తుఫాను సమయంలో ఓ ట్రాలర్ అదుపు తప్పి పక్కనున్న మరబోట్లను ఢీకొట్టడంతో అవి కాస్త మునిగి పోయాయి. దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. ఈ దయనీయ పరిస్థితులలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వారికి అండగా నిలిచి వారి దీన పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఇదే విషయాన్ని పోర్టు చైర్మన్ టి. కృష్ణబాబుతో మాట్లాడగా వారు స్పందించి భారీ క్రేన్ల సహాయంతో వాటిని బయటకు తీయించారు.

మరబోటు యజమానులు ఆందోళన చెందడాన్ని జీర్ణించుకోలేని వాసుపల్లి వారిని ఓదార్చి అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నందున రాలేకపోతున్నానని ఓదార్చారు. కార్యక్రమంలో పోర్టు డీటీఎం అవతారం నాయుడు, ఏటీఎం రామలింగేశ్వరరావు, మత్స్య శాఖ ఏడీ లక్ష్మణ రావు, ఎఫ్‌డిఓ విజయ, ఏపీ మరబోట్ల సంఘం అధ్యక్షుడు పక్కళ్ల చిన అప్పారావు, మున్నం బాలాజీ పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కలను

# ప్రభుత్వం సాకారం చేస్తుంది

**మున్సిపల్ చైర్ పర్సన్ అనిత**



నర్సీపట్నం: పేదోడి సొంతింటి కలను తెలుగుదేశం పార్టీ సాకారం చేస్తుందని నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ చింతకాయల అనిత, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు అన్నారు. శనివారం నర్సీపట్నం మున్సిపాలిటీలోని 27వ వార్డులో ఎన్టీఆర్ గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. గృహ లబ్ధిదారులకు సాంప్రదాయపదముగా చీర, పంచెతో కలిసి పట్టాను అందజేశారు.

పెదబడ్డేపల్లిలో కొత్తగా మంజూరు కాబడిన సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్డాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. అలాగే రానున్న రోజులలో వార్డులో మిగిలిన ఉన్న రోడ్లను సిమెంట్ రోడ్లుగా చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రములో వార్డు కౌన్సిలర్లు రెడ్డి అప్పలనాయుడు, గవిరెడ్డి స్వామి నాయుడు, హౌసింగ్ బోర్డు డైరెక్టర్ రుత్తల చినరమణ, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ టికెట్‌కు రామసత్యం దరఖాస్తు

యలమంచిలి రూరల్: యలమంచిలి నియోజకవర్గ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయడానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు రావి రామసత్యం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విశాఖలో డిసిసిఈ అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీనివాస్‌ను కలిసి దరఖాస్తును అందజేసినట్లు చెప్పారు.

రామసత్యం గతంలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న రోజుల్లో విద్యార్థి నాయకునిగానే కాకుండా 1992 సంవత్సరంలో విద్యార్థి సంఘం జిల్లా సెక్రటరీగా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడి పని చేసిన అనుభవం ఉంది.

ఎంపి, ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# అప్పారావు సేవలు మరువలేనివి



ములగాడ: హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ కో-ఆపరేటివ్ సొసైటీలో పనిచేస్తున్న మాకిన అప్పారావు పదవీ విరమణ అయిన సందర్భంగా సొసైటీ సభ్యులు అందరూ కలిసి ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సన్మానానికి ముఖ్య అతిథిగా సర్వసిద్ధి శ్రీనివాసురావు పాల్గొని అప్పారావు చేసిన సేవల గురించి కొనియాడారు. అదేవిధంగా అప్పారావు సొసైటీ కార్మికులు అందరితో మరియు యాజమాన్యం అధికారులతో కలిసి మెలిసి పనిచేస్తూ మంచి ఆదరణ పొందిన వ్యక్తి అని అన్నారు. ఆయనకు మా అందరి చేతుల మీదుగా సన్మానం చేయడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. మాకిన అప్పారావు మాట్లాడుతూ సొసైటీ కార్మికులలో ఎటువంటి కష్టాలు వచ్చినా అందరూ ఐక్యతగా ఉండడం చాలా గొప్ప విషయమని, పదవీ విరమణ అయిన ప్రతీ ఒక్క కార్మికులకు సొసైటీ సభ్యులు అంతా కలిసి ప్రత్యేకంగా సన్మానం చేయడం చాలా ఆనందకరమైన విషయం ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వసిద్ధి పైడిబాబు, చొప్ప అప్పలరాజు, నూనెల రాజు, సిహెచ్ సూరిబాబు, ఉప్పిలి అప్పారావు, బొట్ట అప్పారావు, ఉరుకుటి అప్పారావు, నూనెల ఈశ్వరావు, నీలాతి రాజు, ఈగల వెంకటరావు, ఈగల అప్పారావు, నూనెల అప్పారావు, ఊరుకుటి నాగేశ్వరరావు, వై అప్పలరాజు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# నేడు సామూహిక అక్షరాభ్యాసాలు

కొయ్యూరు: వసంత పంచమి సందర్భంగా ఈ నెల 10న కొయ్యూరు భారతీయ విద్యా కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నారు. మూడేళ్లు దాటిన పిల్లలను తల్లిదండ్రులు అక్షరాభ్యాసం కోసం తీసుకురావచ్చని ప్రధానాచార్యులు రవికుమార్ తెలిపారు. బాసరజ్ఞాన సరస్వతి ఆలయంలో అర్చన చేసిన కుంకుమతో సరస్వతి అష్టోతర పూజను నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి వివరాల కోసం 7382119670 సంప్రదించాలని ఆయన కోరారు.

# ఉపకరణాలకు 43 మంది ఎంపిక

రావికమతం: నర్సీపట్నం డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు అక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన ఉపకరణాల గుర్తింపు వైద్య శిబిరంలో మండలానికి చెందిన 43 మంది విద్యార్థులకు ఉపకరణాలు పొందటానికి ఎంపికయ్యారు. ఈ మేరకు స్థానిక భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాధనాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. పిల్లలు శిబిరానికి వెళ్లటానికి సిద్దార్థ స్కూల్ యాజమాన్యం బస్సు వేశారని చెప్పారు.

# ఎల్‌ఎల్‌ఆర్ మేళా 12కు వాయిదా

రోలుగుంట: వాహనాలు ఉండి లైసెన్సులు లేని వారి కోసం శనివారం నిర్వహించాల్సిన ఎల్‌ఎల్‌ఆర్ మేళా ఈ నెల 12కు వాయిదా పడినట్టు ఎంవి ఇన్‌స్పెక్టర్ సంజీవరావు తెలిపారు. లైసెన్సులు పొందగోరు అభ్యర్థులు స్థానిక మీ సేవ కేంద్రాల వద్ద విధిగా ముందుగా స్లాట్ బుక్ చేసుకొని, ద్విచక్ర వాహనానికి రూ.330, నాలుగు చక్రాల వాహనాలకు రూ.460 చెల్లించాలన్నారు. వివరాలకు 9640119119ను సంప్రదించాలన్నారు.

# 13న ఉచిత కంటి వైద్య శిబిరం

కొయ్యూరు: ఈ నెల 13న రాజేంద్రపాలెం ఆరోగ్య కేంద్రంలో విశాఖపట్నం శంకర్ పౌండేషన్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తుంది. కంటి సంబంధిత వ్యాధులతో బాధపడేవారు దీనిని వినియోగించుకోవాలని వైద్య సిబ్బంది తెలిపారు. కంటి వైద్య నిపుణులు ఉదయం పది గంటలలోపు వచ్చేస్తారని తెలిపారు. కంటి వైద్య నిపుణులు ఉదయం పది గంటల లోపు వచ్చేస్తారని తెలిపారు. కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని చెప్పారు.

# గీతంలో వెల్లివిరిసిన సృజనాత్మకత

**సాంకేతిక యువజనోత్సవంలో సత్తాచాటిన విద్యార్థులు**





సాగర్‌నగర్: అవరోధాలను అధిగమిస్తూ లక్ష్యాన్ని చేరే రోబో వాహనాలు, విద్యుత్తు సహాయంతో నడిచే రేస్ కార్లు, ముఖ కవళికల ఆధారంగా బ్యాంకు ఖాతాలు హ్యాకింగ్‌కు గురికాకుండా చేసే పరిజ్ఞానం, సామాజిక సమస్యలను ఇతివృత్తంగా చేసుకుని రూపొందించిన లఘు చిత్రాలు, కాన్వాస్ పై రంగులతో వెల్లివిరిసిన అందాలు, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఐ-స్కేర్-ఆర్ పేరట జరుగుతున్న యువజనోత్సవంలో యవతలోని సృజనాత్మకతకు అద్దం పట్టాయి.జాతీయ స్థాయిలో ఇసిఇ విభాగానికి అనుబంధంగా గల ఇనిస్టిట్యూట్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూని కేషన్ ఇంజనీర్స్ (ఐఈటిఈ) విద్యార్థి విభాగం నిర్వహిస్తున్న ఈ సాంకేతిక ఉత్సవానికి దేశం నలుమూలల నుంచి దాదాపు 800 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరయ్యారు.

సాంకేతిక అంశాలపై జరిగిన చర్చలలో సహితం ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన వివిధ పోటీలలో విజేతలకు వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరావు, ప్రొఫెసర్ సి.ధర్మరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.బి. సెవెంతలైన్, ఫ్యాకల్టీ సలహదారు కె.కరుణకుమారీ హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## పరిశ్రమలతో సంబంధాల ద్వారా

# మెరుగైన సాంకేతిక విద్య

**దేశ రక్షణ రంగ శాస్త్రవేత్త శ్రీనివాస్**



సాగర్‌నగర్: పరిశ్రమలతో సంబంధాల ద్వారా సాంకేతిక విద్యను మెరుగైన రీతిలో విద్యార్థులకు బోధించవచ్చునని ముఖ్యంగా పరిశ్రమల సహకారంతో ప్రత్యక్ష సాంకేతిక శిక్షణ విద్యార్థులకు అందుతుందని రక్షణ రంగ శాస్త్రవేత్త ఐఐటి ఢిల్లీ పూర్వవిద్యార్థి డాక్టర్ కె.వి.శ్రీనివాస్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి అనుబంధంగా పారిశ్రామిక సంబంధాల కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పరిశోధనాత్మక దృష్టికి, సృజనాత్మకతను జోడిస్తే ఇంజనీరింగ్ లో కొత్త ఆవిష్కరణలకు యవత గుర్తించవచ్చునన్నారు.

కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నలజీ వైస్ ప్రిన్సిపాల్ ఎం,వెంకటేశ్వరావు బ్రోచర్‌ను రిలేజ్ చేశారు. గీతం ఇఇఇ విభాగం అధిపతి ఎ.రాములు మాట్లాడుతూ పరిశ్రమలతో మెరుగైన సంబంధాలకు, పరిశోధనలకు, సమావేశాలు, సదస్సుల నిర్వహణకు పారిశ్రామిక సంబంధాల కేంధ్రం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నలజీ వైస్ ప్రిన్సిపాల్ ఎం,వెంకటేశ్వరావు

కేంధ్రం కో-ఆర్డినేటర్లు కె.శ్రీచరణ్,ఎమ్. ఇబ్రహీం మాట్లాడుతూ విద్యుత్తు ఉత్పాదన రంగంలో వస్తున్న మార్పులు, సంప్రదాయేతర ఇందన వనరులపై నిపుణులతో ప్రసంగాలను ఏర్పాటు చేసే ఉద్దేశ్యంలో ఉన్నామన్నారు.

# రోడ్డు పనులకు శంకుస్థాపన



భీమునిపట్నం: మండలంలోని అమనాం నుంచి చిప్పాడ వరకూ రూ. 60 లక్షలతో కొత్తగా రోడ్డు వేయడానికి భీమిలి ఎం.పి.పి యరబాల కృష్ణవేణి శనివారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళగా అమనాం నుంచి చిప్పాడ చేరుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ తెలిపారు. ఈ రోడ్డు వేయడం వలన అమనాం గ్రామంలో ఉన్న అతి తక్కువ వ్యవధిలో చిప్పాడ చేరుకోవచ్చనీ తెలిపారు.

ఇంకా ఈ కార్యక్రమంలో రూరల్ మండలం టీడీపీ అధ్యక్షులు డి.ఎ.ఎన్ రాజు, జడ్పీటీసీ సరగడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# భీమిలిలో ఎన్టీఆర్ గృహాలు ప్రారంభం



భీమునిపట్నం: భీమిలి డివిజన్‌లో ఎన్టీఆర్ గృహాలను భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటానూకరాజు శనివారం ప్రారంభించారు. డివిజన్ పరిధిలో ఉన్న 14 వార్డులకు కలిపి మొత్తం 237 ఎన్టీఆర్ స్వగృహాలను రాజలింగం పేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ సిఎం ప్రమాణస్వీకారం చేసిన తరువాత ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నికల మానిఫేస్ట్‌లో లేని పధకాలను సి.ఎం పెట్టినట్లు తెలిపారు. 2014కు ముందు అప్పటి ప్రభుత్వం రూ.80 వేలు ఇచ్చేదనీ, కాని ఇప్పుడు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత .100 శాతం సబ్సిడీ 2 లక్షల 50 వేల రూపాయలు ఇస్తున్నట్లు తెలిపారు. అందుకే ప్రతీ పేదవాడు ఇంటి నిర్మాణం కోసం ముందుకు వస్తున్నారని చెప్పారు. గతంలో అధికారులు చుట్టూ తిరిగితే, ఇప్పుడు ఆన్లైన్‌లో ధరఖాస్తులు పెట్టుకొనే సౌకర్యం టీడీపీ ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. రాష్ట వ్యాప్తంగా 4 లక్షల ఇళ్ళు సి.ఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగినట్లు అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో భీమిలి టీడీపీ నాయకులు గిడుతూరి శ్రీనివాసరావు, పెంటపిల్లి యోగీశ్వరావు, మారోజు సంజీవ్ కుమార్, కోండ్రు రమణమ్మ, గూడపు రాజు, మురళి, సురేష్, డెక్కతి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకోట సిఐగా లక్ష్మణమూర్తి

రావికమతం: మండలంలోనికొత్తకోట సిఐగా ఎస్.లక్ష్మణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. విఆర్ నుంచి ఇక్కడ పోస్టింగ్ రావడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని నాలుగు పోలీస్‌స్టేషన్‌లలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా శాఖాపరమైన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

# 'ఆదరణ' సైకిళ్ళు పంపిణీ



భీమునిపట్నం: స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో ఆదరణ-2 పథకం క్రింద సుమారు 300 సైకిళ్ళను లబ్ధిదారులకు భీమిలి ఎంపిపి యరబాల కృష్ణవేణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా కులవృత్తుల వారికి సబ్సిడీతో పంపిణీ చేయడం వలన ఉపయోగం ఉంటుందని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సరగడ అప్పారావు, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు డి.ఎ.ఎన్ రాజు, టీడీపీ నాయకులు అనీల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 164 ఎన్‌టిఆర్ హౌసింగ్ గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు



సబ్బవరం : మండలంలోని అర్హులైన వారికి అసకపల్లి పంచాయితీలో ఎరుకునాయుడుపాలెం గ్రామంలో 164 ఎన్టీఆర్ హౌసింగ్ గృహ సముదాయానికి పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శనివారం శంఖుస్థాపన చేసారు. మండలంలో గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయిన 393 ఎన్టీఆర్ గృహాలను ప్రారంభోత్సవాలు చేసారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజల అభివృద్ధికి అనేక విధాల టిడిపి శ్రమిస్తుందన్నారు. వృద్ధులకు పింఛన్లు, నిరుద్యోగులకు భృతి ఒంటరి మహిళలకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్లు ఇస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు వేయించిందన్నారు. మాది పనిచేసే ప్రభుత్వ మన్నారు. ఈ కార్యక్రమాల్లో మిడతాడ మహలక్ష్మినాయుడు, గండి దేముడు, గవర అప్పారావు, గండి ముత్యాలనాయుడు, బి బాబూరావు, గొర్లె సత్యనారాయణ, రేషిపూడి రమణ, పల్లా తాతారావు, కోరాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజయభాను

సంపాదకీయం

## క్షిపణి పోటీ

ప్రపంచ దేశాలు మళ్ళా ప్రచ్ఛన్నయుద్ధం నాటి అనిశ్చిత పరిస్థితుల్లోకి అడుగుపెడుతున్న తరుణంలో అమెరికా మధ్యతరహా అణ్వస్త్ర (ఐఎన్ఎఫ్) నిర్మూలన ఒప్పందం నుంచి వైదొలుగడం ఆందోళన కలిగిస్తున్నది. అమెరికా ప్రకటనకు దీటుగా రష్యా కూడా ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించడమే కాకుండా మరింత ఆధునిక క్షిపణులను రూపొందిస్తున్నట్టు వెల్లడించింది. ఒప్పంద నిబంధనల ప్రకారం- లాంఛనంగా వైదొలుగడానికి మరో ఆరు నెలలు పడుతుంది. కానీ రెండుదేశాల వైఖరిని గమనిస్తే, ఒప్పందం నిలిచే సూచనలు కనిపించడంలేదు. ఈ ఒప్పందంలో భాగస్వాములైన అమెరికా, రష్యా దేశాలు కొంతకాలంగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్టు పరస్పరం విమర్శించుకుంటున్నాయి. 1987 డిసెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు రీగన్, సోవియెట్ అధినేత గోర్బచేవ్ మధ్య కుదిరిన ఈ ఒప్పందం మిగతా నిరాయుధీకరణ ఒప్పందాలకు దిక్సూచి వంటిది. దీనివల్ల యూరప్ దేశాల రాజధానులపై ఎక్కుపెట్టిన అణు క్షిపణులను సోవియెట్ యూనియన్ తొలిగించింది. అమెరికా కూడా తన క్షిపణులను ధ్వంసం చేసింది. కానీ వ్యూహాత్మకంగా ఈ క్షిపణులను ధ్వంసం చేసినప్పటికీ, మరింత ఆధునిక క్షిపణి వ్యవస్థల కోసం ఇరుపక్షాలు పరిశోధనలు సాగిస్తున్నాయి. ఇప్పుడు అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను పరీక్షించి మోహరించడానికి ఏర్పాట్లు చేసుకున్నాయి. అయితే తాజా ఆయుధ పోటీ యూరప్ కన్నా ఆసియా- పసిఫిక్ ప్రాంతంలోనే ఎక్కువగా ఉంటుందని రక్షణ నిపుణులు అం టున్నారు. ఐఎన్ఎఫ్ ఒప్పందం అమెరికా, రష్యా మధ్య కుదిరింది కనుక కొత్తగా ఎదుగుతున్న చైనాకు వర్తించదు. అందువల్ల తాము ఒప్పందం నుం చి వైదొలుగుతున్నామని కూడా అమెరికా అం టున్నది. కానీ చైనాతో చర్చలు జరిపి, ఆ దేశా న్ని ఒప్పందంలోకి తేవడానికి ప్రయత్నించాలే తప్ప, ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవడం పరిష్కారం కాదు. ఈ ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగడం పట్ల ఆందోళన వెలిబుచ్చిన చైనా, ఇప్పటికైనా చర్చలు జరిపి పరిష్కారం సాధిద్దామనే అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. దీన్నిబట్టి చైనాతో కనీసం చర్చలు జరిపే పరిస్థి తి ఉన్నదని తెలిసిపోతున్నది. చైనా క్షిపణుల మోహరింపునకు పాల్పడుతున్నది నిజమే. ముఖ్యంగా తైవాన్ ప్రాంతంలో అమెరికా దాడులకు దిగితే తట్టుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నది. ఈ వివాదం ఈశాన్య ఆసి యా ప్రాంతానికే పరిమితమైనట్టు కనిపిస్తున్నప్పటికీ, అమెరికా- చైనా ఘర్షణ మొత్తం ఆసి యా- పసిఫిక్ ప్రాంతమంతా విస్తరించి ఉన్నది. హిందు మహాసముద్ర ప్రాంతం కూడా ఇందు కు అతీతం కాదు. ఇక్కడే భారత్ అప్రమత్తం కావలసి ఉన్నది. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలోని ఉద్రిక్తతలు మొత్తం హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. భార త్ ఇటీవలికాలంలో అమెరికా ప్రోద్బలంతో దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో ప్రవేశిస్తున్నది. ఈ నేపథ్యంలో చైనాతో క్షిపణిరంగంలో పోటీపడాలని చూస్తున్న అమెరికా వైఖరిని గమనంలో కి తీసుకోవాలె. భవిష్యత్తులో అమెరికా- చైనా ఉద్రిక్తతలు ఏ మోతాదులో, ఏయే రూపాలలో ఉంటాయో, మన పాత్ర ఏమిటో విశ్లేషించుకోవాలె. బుల్లెట్ మనుషులను చంపదు, ట్రిగర్‌ను నొక్కే వేలు చంపుతుంది అనేది ఒక జేమ్స్‌బాండ్ సినిమాలోని వ్యాఖ్య. ఆయుధాలనే కన్నా మనిషిలోని అసహనం, యుద్ధోన్మాదం ప్రపంచానికి ప్రమాదకరం. ఒక క్షిపణి ఒప్పందం నుంచి వైదొలుగడమే కాదు, అంతర్జాతీయ ఒప్పందాలు, కూటములు, మొత్తంగా సమష్టితత్వం పట్ల అమెరికా ప్రదర్శిస్తున్న అసహనం, దుందుడుకు వైఖరి భయాందోళనలను కలిగిస్తున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ఇరాన్ అణు కార్యక్రమాన్ని నియంత్రించే ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించారు. ఇరాన్ ఒప్పందం పట్ల యూరోపియన్ దేశాలు ప్రదర్శించిన సామరస్యాన్ని అమెరికా చూపలేకపోయింది. ట్రంప్ ఆసియా- పసిఫిక్ ఒప్పందం నుంచి కూడా ఇదేరీతిలో వైదొలిగారు. నాటోలో భాగస్వాములైన యూరప్ దేశాలు నిధులు ఇవ్వడంలేదంటూ అసహనం వ్యక్తంచేస్తున్నారు. ట్రంప్ బ ృందంలోని సభ్యులు కూడా ఒకరికి మించి మరొకరున్నారు. ట్రంప్ ఆలోచనా ధోరణికి ఆయన జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ మాటలు అద్దం పడుతుంటాయి. బోల్టన్‌కు ఆయుధ నియంత్రణ, అంతర్జాతీయ కూటములు, బహుళ పక్ష ఒప్పందాలు మొదలైనవేవీ నచ్చదు. చివరికి ఐక్యరాజ్యసమితి అంటే కూడా చిర్రెత్తుకొస్తుంది. ఇవన్నీ ఘనత వహించిన అమెరికా ప్రాబల్యా న్ని కట్టడి చేస్తున్నాయనేది ట్రంప్ బ ృందం బాధ. సరిహద్దులో గోడలు కట్టుకోవాలనే ఇటువంటి ఏకాకి మనస్తత్వం వల్ల అంతిమంగా అమెరికాకూ నష్టమే.

## మంచిని స్వాగతించలేని దీనస్థితిలో ప్రతిపక్షం

### ఎమ్మెల్యే మీసాల గీత



విజయనగరం : మంచిని స్వాగతించలేని దీనస్థితిలో ప్రతిపక్షం ఉందని ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. పేదల అభ్యున్నతే టిడిపి ధ్యేయమన్నారు. శనివారం స్థానిక ఒకటోవార్డు వైఎస్ఆర్ నగర్‌కు చెందిన 50 కుటుంబాలకు చెందినవారు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వైఎస్ఆర్ నగర్ ప్రధాన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా మీసాల గీత, ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు మహిళలను అన్నివిధాలుగా ఆదుకుంటున్నారని తెలిపారు. ప్రతీ మహిళకు న్యాయం జరిగేలా రూ.10వేలు పసుపు, కుంకుమ క్రింద అందజేస్తున్నారన్నారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఫించన్లు రెండువేలు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అన్ని సామాజిక వర్గాల ప్రజలకు న్యాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతల మాటలను ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు. చంద్రబాబు అందజేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ నాయకులు చౌకబారు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. 2009 ఎన్నికల ముందు కోలగట్ల వీరభద్రస్వామి, అతని అనుచరులు పంపిణీ చేసిన దొంగ ఇళ్ల పట్టాలు గురించి బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. వారు కోరిన చోటికి వచ్చి మీడియా సమక్షంలో దొంగ పట్టా జెరాక్స్ కాఫీలను చూపిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎన్ఎం రాజు, ఎఎంసి చైర్మన్ సైలాడ త్రినాథ్, గంథాలయ సంస్థ చైర్మన్ బొద్దల నర్సింగరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, తెలుగుయువత అధ్యక్షుడు కర్రోతు వెంకటనర్సింగరావు, కౌన్సిలర్లు ముద్దాడ చంద్రశేఖర్, బొబ్బాది త్రినాథ్, సోము శ్రవంతి, జడ్పీటీసీ తుంపల్లి రమణ, పార్టీ నాయకులు కెంగువ శ్రీను, గంటా పోలినాయుడు, బండి జనార్ధన్, 1వ వార్డు అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక గృహప్రవేశాలను ప్రారంభించిన అవంతి



అనకాపల్లి : అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం సామూహిక గృహప్రవే శాలను ప్రారంభించారు. శంకరం, సత్యనారా యణపురం, గ్రామాలలో నిర్మించిన భవన సముదాయాలను ప్రారంభోత్సవం చేసారు. ఈసందర్భంగా లబ్దిదారులు గృహప్రవేశాలు జరిపారు. అనంతరం సామూహిక సత్య నారాయణ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ అవంతి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో అర్హులైన వారందరికి ఇళ్లస్థలాలతో పాటు, ఇళ్లులు నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదన్నారు. మంజూరైన లబ్దిదారులు అందరూ నివాసంలో ఉండాలని, కోరారు. అవసరమైన మౌళిక సదుపాయాలను కూడా కల్పించడం జరుగుతుందన్నారు.

ముందుగా భవన సము దాయాల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ, జిల్లా తెలుగు రైతు నాయకులు పోల్నాటి అప్పారావు, తెలుగు దేశం నాయకులు మళ్ల సురేంద్ర, కొణతాల వెంకటరావు, పలకా సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమయం

### కనిపించే దైవం గురువు

అజ్ఞాన తిమిరాన్ని తరిమి
జ్ఞాన జ్యోతిని వెలిగించి
విద్య ఓ తపస్సు జీవితానికది
ఒక ఉషస్సు అని భోదించి

మానవ మనుగడకు
విద్య మూలాధారమని
విద్యార్ధి జీవితాన్ని
దిశ నిర్దేశం చేసి

వినయ విధేయతలు విద్య ద్వారానే
వ్యక్తికి సంక్రమిస్తాయని తెలిపి
ప్రతి నిత్యం విద్యార్థిగా ఉంటూ
మదిలో శోధించి బడిలో బోధించి

జ్ఞానాన్ని అందరికీ పంచి
వ్యక్తిని వ్యవస్థనీ సంస్కరించి
కనిపించే దైవంగా
పూజలందుకొంటున్న
గురువులందరకు పాదాభివందనం

రచయిత
ఆర్.శంకర్

## పంచాంగం

మాసం : పుష్య; తిథి : పంచమి ఉ.10.22; రేవతి సా.4.14; వర్జ్యము లేదు

ఆదివారం 10-02 -2019

a **మేషం** : రుణం ఏ కొంత అయినా తీర్చగలుగుతారు. సేవా కార్యక్రమాల్లోనూ, భక్తి కార్యక్రమాలలోనూ చురుకుగా పాల్గొంటారు. ఎదుటివారిని ఆకట్టు కునే ప్రయత్నంలో సఫలీకృతులవుతారు. కొత్త కొత్త పెట్టుబడుల పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిత్య, కంది, మినుము, నూనె వ్యాపారస్తులకు దిన దినాభివృద్ధి ఉంటుంది. b **వృషభం** : జీవితంలో చక్కని మలుపు మీకు తెలియకుండానే జరుగుతుంది. పొదుపు ఆవశ్యకతను గురించి తెలుసుకుంటారు. స్త్రీలకు అనురాగ వాత్సల్యాలు పెంపొందుతారు. పాత మిత్రుల కలయిక మళ్ళీ మళ్ళీ జరగటం వల్ల మీలో ఎంతో ఉత్తేజాన్ని చేకూరుస్తుంది. కొత్త కొత్త వ్యాపారాల పట్ల ఏకాగ్రత వహిస్తారు. C **మిథునం** :ఉన్నట్టుండి మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. విద్యార్థులకు కోపం తారాస్థాయికి చేకూరుతుంది. కంట్రోల్ చేసుకోవడం వల్ల బంధు మిత్రులతో గుర్తింపు లభించగలదు. పండ్ల, పూల, కొబ్బరి వ్యాపారస్తులకు కలిసివచ్చే కాలం. కొన్ని అలవాట్లు మీకు ఎంతో చికాకును కలిగిస్తాయి. d **కర్కాటకం**: ఆర్థిక ఇబ్బంది అంటూ లేకపోయినా పురోభివృద్ధి అంటూ ఏదీ ఉండదు. ప్రయాణాలు మీకు అనుకూలించగలవు. మీరు తెలివైన వ్యక్తులతో జాగ్రత్త వహించండి. మీలో ఆత్మాభిమానం అధికమవుతుంది. ఐరన్, సిమెంట్, కలప, ఇటుక, వ్యాపారస్తులకు ఆశాజనకం. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. e **సింహం**: ముఖ్యులకు బహుమతులు అందజేస్తారు. వస్త్ర, బంగారు, వెండి, లోహ, పీచు వ్యాపారస్తులకు ఆశాజనకం. ప్లీడర్లకు, ప్లీడరు గుమాస్తాలకు చేపట్టిన పనిలో అవరోధాలను ఎదుర్కొంటారు. మీ పెద్దల మూలంగా మీ సమస్యలు జటిలమవుతాయి. మతపరమైన విషయాలు చర్చకు రాగలవు. వైద్యుల సలహా తప్పదు. f **కన్య**: విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. హోటల్, తినుబండారాల వ్యాపారులకు, క్యాటరింగ్ రంగాలవారికి కలిసివచ్చే కాలం. ఉన్నట్టుండి మీలో వేదాంత ధోరణి అధికమవుతుంది. మిమ్మల్ని వేరే వ్యక్తుల కలయిక వల్ల సంతృప్తి కానవస్తుంది. ప్రైవేట్ రంగాల వారు మార్పుల కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. g **తుల**: పెద్దల ఆశీస్సులు మీకు మెండుగా లభిస్తాయి. ఇది సుఖపడే మార్గం అని రెడీమేడ్‌గా ఎక్కడా ఉండదు. మన మనస్సును బట్టి... మనలను బట్టి వుంటుంది. మీలో నిరుత్సాహాన్ని పక్కన పెట్టి ధైర్య సాహసాలతో ముందుకు సాగి జయం పొందండి. ప్రభుత్వ రంగ సంస్థల్లోని వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. h **వృశ్చికం**: ఏ విషయంలోనూ ఊగిసలాట మంచిది కాదని గమనించండి. విద్యార్థుల్లో నూతన ఉత్తేజం కానవస్తుంది. ఏజెంట్లకు, బ్రోకర్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభదాయకంగా ఉండగలదు. సాంఘిక, సంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటారు. రుణం తీర్చాలనే ఆలోచనను క్రియా రూపంలో పెట్టండి.

## 60 వ రోజుకు చేరిన దీక్షలు

అనకాపల్లి : టి. వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67,68 లో గల భూమిలో సాగు రైతులకు పరిహారం చెల్లించాకే భూములు సేకరించాలనే డిమాండ్ తో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 60 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ సంపతిపురం మాజీ సర్పంచ్ నంబారు శ్రీను తన కుటుంబ సభ్యుల పేర్లను నకిలీ లబ్ధిదారులుగా తయారు చేసి ఆ పేర్లతో సుమారు రెండు కోట్ల రూపాయలు కాజేయడానికి ప్రయత్నం చేస్తే దానికి ఎమ్మెల్యే పీలా గోవిందు సత్యనారాయణ మద్దతు ఇస్తే దాన్ని జనసేన పార్టీ అడ్డగించిందన్నారు. ఆ తర్వాత అనేక రకాల ఉద్యమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఢిల్లీ స్థాయిలో ఆందోళన చేసినా ప్రభుత్వం సిగ్గుపడకపోవడం వారికే సిగ్గు చేటన్నారు. కానీ న్యాయం జరిగే వరకూ తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ ఉమర్, దాడి బుజ్జి, మళ్ల రాజా, గల్లా వినోద్, కోరుకొండ జగదీష్, రైతులు కుండల లోవరాజు, ఉరుకూటి అప్పారావు, భరణికాన ముత్యాలు, ఉరుకూటి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో ఆదుకునే నారసింహుడు

సంకీర్తన



నరసింహస్వామి తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించడం కోసమే ఆవిర్భవించాడు కనుక, భక్తులను ఆదుకోవడంలోను .. అనుగ్రహించడంలోను ఆయన ఎంత మాత్రం ఆలస్యం చేయడని అంతా విశ్వసిస్తుంటారు. ఆ స్వామి కొలువైన ప్రాచీనమైన క్షేత్రాల్లో ప్రకాశం జిల్లా పరిధిలో గల 'సింగరాయ కొండ' ఒకటిగా కనిపిస్తూ వుంటుంది. ఈ క్షేత్రం మహిమాన్వితమైనదని చెప్పబడే ఎన్నో సంఘటనలు ఇక్కడ కథలు .. కథలుగా వినిపిస్తూ వుంటాయి.

పూర్వం ఈ స్వామిని అర్చించే పూజారి, పసివాడైన తన బిడ్డతో సహా ఆలయానికి వెళ్లి, స్వామివారికి నైవేద్యం సమర్పించి వెనుతిరిగాడట. తన బిడ్డను ఆలయంలో మరిచిపోయి వెళ్లిన ఆయనకి, చాలా సేపటి తరువాత ఆ విషయం గుర్తుకు వచ్చింది. తన మతిమరుపుకు తిట్టుకుంటూ, పరుగు పరుగున ఆలయం దగ్గరికి చేరుకున్నాడు. పిల్లవాడు ఆకలితో ఏడుస్తూ ఉంటాడని అనుకుంటూ, ఆతృతగా తలుపులు తెరిచాడు.

ఆలయంలో ఆడుకుంటోన్న పిల్లవాడిని చూసి ఆనందంతో పొంగిపోయాడు. పిల్లవాడిని అక్కున చేర్చుకుని ''ఆకలి వేయలేదా?'' అని అడిగితే, నరసింహస్వామి మూర్తిని చూపించి ఆయన తనకి అన్నం తినిపించాడని చెప్పాడట. స్వామి ఇక్కడ ప్రత్యక్షంగా ఉన్నాడని చెప్పడానికి ఇదొక నిదర్శనమని చెబుతుంటారు. ఇక్కడి నారసింహుడు మనసున్నవాడనీ .. మహిమగలవాడనీ .. ఆపదలో ఆదుకునే బంధువని విశ్వసిస్తుంటారు.

### ఈ శకునం శుభసూచకమే !

ఏదైనా ఒక ముఖ్యమైన పనిమీద ఎక్కడికైనా వెళ్లాలని అనుకున్నప్పుడు, శకునం చూసుకుని బయలుదేరుతూ వుంటారు. కాస్త ఆలస్యమైనా మంచి శకునం చూసుకునే అడుగు బయటికి పెడుతుంటారు. ఇలా మంచి శకునం చూసుకుని బయలుదేరడం వలన, వెళ్లిన పని సఫలీకృతమవుతుందనే విశ్వాసం పూర్వకాలం నుంచీ వుంది. ఎవరికి వాళ్లు తాము తలపెట్టేకార్యాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలనే ఆశిస్తారు. అందుకే శకునానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుంటారు.

ఈ నేపథ్యంలో కొన్ని శకునాలు మంచివిగా ... మరికొన్ని శకునాలు అందుకు విరుద్ధమైనవిగా చెప్పబడుతున్నాయి. ఇక కార్యసిద్ధిని కలిగించే శకునాలలో పూలు - పండ్లు కనిపిస్తూ వుంటాయి. సాధారణంగా దైవదర్శనానికి వెళ్లాలని అనుకోగానే ముందుగా గుర్తుకువచ్చేది పూలు .. పండ్లే. భగవంతుడిని పూలతో అలంకరిస్తూ .. అర్చిస్తూ వుంటారు. ఆయనకి వివిధరకాలైన పండ్లను నైవేద్యంగా సమర్పిస్తూ వుంటారు.

ఇక శుభకార్యాలలోను పూలు - పండ్లకి ప్రధానమైన స్థానం ఇవ్వబడుతుంది. ఇవి లేకుండా శుభకార్యమనేది జరగనే జరగదు. దీనినిబట్టి పూలు - పండ్లు ఎంతటి శుభప్రదమైనవో అర్థంచేసుకోవచ్చు. అందువలన పూలబుట్టతో గానీ .. పండ్లబుట్టతో గాని ఎవరైనా ఎదురురావడం శుభసూచకంగా విశ్వసించడం జరుగుతోంది. పూలతోను ... పండ్లతోను కూడిన శకునం మంచిదిగా భావించి వెంటనే బయలుదేరవచ్చని స్పష్టం చేయబడుతోంది.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## అడవిరాజులబాబు జాతరకు ఏర్పాట్లు

గొలుగొండః చీడిగుమ్మల, ఎర్రవరంలో ఏటా మహాశివరాత్రి ముందు జరిగే అడవిరాజులబాబు జాతరకు విస్తృత ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఉన్న ఆలయం వద్ద శుక్రవారం జరిగే పండుగ కోసం పండుగ కోసం విద్యుత్ దీపాలంకరణ, తాత్కాలిక ముఖద్వారాలు, షామియానాలు ఇప్పటికే సిద్ధం చేశారు.



ఈ పార్లమెంటు సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పొందేవిధంగా బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఈ రిలే నిరాహార దీక్షలు కార్యక్రమం చేపట్టడం జరిగింది. నవ్యాంధ్ర ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పరిస పోగు శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో బీజేపీ కార్యాలయాల వద్ద రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు కార్యక్రమం కొనసాగుతుంది. రాష్ట్రంలోని బీజేపీ నాయకులు కేంద్ర నాయకులపై ఒత్తిడి తెచ్చి ఈ ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. మా ఈ సమస్యను పరిష్కరించే వరకూ మా పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముందు అప్పలరాజు, సిటీ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు మరియు జి.గోపి, ఆదినారాయణరాజు, ఎం.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

# సంబరంగా సామూహిక గృహప్రవేశాలు

## ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు స్వాధీన పత్రాలు



విజయనగరం : సొంతింటి కలను సాకారం చేసుకున్న తరు ణాన ఇంతులు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యారు. ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ఇంటి స్వాధీన పత్రాలను తీసుకుం టున్నప్పుడు భావోద్వేగం చెందారు. తమ ఆనందాన్ని వేదికమీదనే పంచుకున్నారు. అందరికి ఇల్లు పథకంలో భాగంగా సారిపల్లి వద్ద నిర్మించిన 950 ఇళ్లకు సంబంధించి సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ ఛైర్మన్ ప్రసాదుల రామకృష్ణలు మాట్లాడుతూ పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చాలనే కంకణం కట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అనేక పథకాలు ద్వారా లక్షలాది గృహాలు నిర్మించి, అర్హులైన వారందరికీ అందజేస్తున్నారన్నారు. పండగ వాతావరణంలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. 2022 నాటికి ప్రతీ ఒక్కరికి ఇల్లు ఉండాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్య మన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాల్లో అనేక కుంభ కోణాలు జరిగాయన్నారు. తమ ప్రభుత్వం ప్రతీ ఇంటికి ఒక లెక్క, ఖర్చుపెట్టిన ప్రతీ పైసాకు పారదర్శకత తీసుకువచ్చామన్నారు. ప్రజలు కోరుకునేటట్లుగా ఇళ్లు నిర్మించి అప్పగిస్తున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పేదవాడి సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతీ పేదవారు ఆనందంగా గడపాలని స్వర్గీయ ఎన్టీఆర్ దేశంలోనే మొదటిసారిగా ఇల్లు లేనివారికి ఆరువేల యూనిట్ ధరతో ఇల్లు ప్రారంభించారన్నారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారన్నారు. ఇల్లులేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వం పేదల గుండెల్లో నిలిచిపోతుందన్నారు. ఈ కార్య క్రమంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జెసి-2 సీతా రామారావు, మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్, టిడ్కో ఇఇ శ్రీనివాసరావు, మెప్మా పిడి అనిల్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎన్ఎం రాజు, ఎఎంసి ఛైర్మన్ సైలాడ త్రినాథ్, గంథ్రాలయ సంస్థ ఛైర్మన్ బొద్దల నర్సింగరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, అధిక సంఖ్యలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అప్పన్న ఆలయంలో రథసప్తమి ఉత్సవం

సింహాచలం : శ్రీ వరహాలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో రథసప్తమి పురష్కరించుకొని మంగళవారంనాడు సింహాచలం దేవస్థానం వారు రథసప్తమి విశేష ఉత్సవం నిర్వహించనున్నారు.

శ్రీ స్వామివారి ఆలయంలో రథసప్తమి పురష్కరించుకొని ఉదయం ఆరాధన మంగళశాసనం అనంతరం 7 గం లకు శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలో గల రాతిరథం పై వేంచేయింపచేసి అభిషేకం విశేష ఆరాధన జరుపబడును మిగతా కార్యక్రమములు యధావిధిగా జరుగును అని సాయంత్రం 5 గం లకు స్వామి వారి తిరువీధి ఉత్సవం జరుపబడును అని కనుక స్వామివారి దర్శనం చేసుకొని తీర్థప్రసాదం లు స్వీకరించి సూర్యభగవానుని కృపతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దేవస్థానం అధికారులు కోరారు.

# పరిశ్రమలతో సంబంధాల ద్వారా మెరుగైన సాంకేతిక విద్య

## దేశ రక్షణ రంగ శాస్త్రవేత్త శ్రీనివాస్



విశాఖపట్నం : పరిశ్రమలతో సంబంధాల ద్వారా సాంకేతిక విద్యను మెరుగైన రీతిలో విద్యార్థులకు బోధించవచ్చునని ముఖ్యంగా పరిశ్రమల సహకారంతో ప్రత్యక్ష సాంకేతిక శిక్షణ విద్యార్థులకు అందుతుందని రక్షణ రంగ శాస్త్రవేత్త ఐఐటి ఢిల్లీ పూర్వవిద్యార్థి డాక్టర్ కె.వి.శ్రీనివాస్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి అనుబంధంగా పారిశ్రామిక సంబంధాల కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పరిశోధనాత్మక దృష్టికి, సృజనాత్మ కతను జోడిస్తే ఇంజనీరింగ్ లో కొత్త ఆవిష్కరణలకు యవత గుర్తించ వచ్చునన్నారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నలజీ వైస్ ప్రిన్సిపాల్ ఎం,వెంకటేశ్వరావు బ్రోచర్‌ను రిలేజ్ చేశారు. గీతం ఇఇఇ విభాగం అధిపతి ఎ.రాములు మాట్లాడుతూ పరిశ్రమలతో మెరుగైన సంబంధాలకు, పరిశోధనలకు, సమావేశాలు, సదస్సుల నిర్వహణకు పారిశ్రామిక సంబంధాల కేంద్రం కృషి చేస్తుం దన్నారు. కార్యక్రమంలో గీతం ఇని స్టిట్యూట్ ఆఫ్ టెక్నలజీ వైస్ ప్రిన్సి పాల్ ఎం,వెంకటేశ్వ రావు కేంద్రం కో-ఆర్డినేటర్లు కె.శ్రీచరణ్,ఎమ్. ఇబ్రహేం మాట్లా డుతూ విద్యుత్తు ఉత్పాదన రంగంలో వస్తున్న మార్పులు, సంప్రదాయేతర ఇందన వనరులపై నిపుణులతో ప్రసంగాలను ఏర్పాటు చేసే ఉద్దేశ్యంలో ఉన్నామన్నారు.



నిజి షోటాఖాన్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2019 పోటీలు ఈ నెల 15, 16, 17 తేదీలలో నిర్వహించనున్నట్లు నిజి షోటాఖాన్ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్‌పిఎండి నాయుడు పేర్కొన్నారు. స్థానిక పౌర గ్రంథాలయంలో శనివారం కరాటే కప్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు మళ్ల విజయప్రసాద్, కెకె రాజు, ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, బొడ్డేపల్లి రఘు, తదితరులు ప్రారంభించారు.

## శివయ్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు స్టీల్ కంచాలు పంపిణీ



విశాఖపట్నం : శివయ్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 41వవార్డు పరిధిలో గల కంచరపాలెం సుభాష్‌నగర్‌లో మహిళ సదస్సు కూలిపని, ఇంటిపని వారు సంక్షేమం కొరకు కార్యాచరణ ప్రణాళిక వర్క్‌షాపు మహిళా చట్టాల కోసం ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిది. ఈ కార్యక్రమంలో దాదాపు 300మంది వీధి మహిళలు కూలిపని చేసేవారు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు స్టీల్ కంచాలు పంపిణీ చేశారు. శివయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ దాసరి శివశంకరరావు, సెక్రటరీ కొరెడ్ల అప్పలరాజు ముఖ్య అతిథులుఆగా బాపూజీ సేవా సంస్థ (బెడ్సు) ఆర్గనైజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.ఈశ్వరమ్మ, శ్రీలత, వరలక్ష్మి, సోనియా పాల్గొన్నారు. అనంతరం జివియంసి కూలిపని చేసేవారికి ఐడిఎన్‌టి కార్డులు అందజేశారు. సభ్యులు కె.రేవతి, కె.నూకరాజు, రూపా, రాణి, కుంచమ్మ, దీపిక, లక్ష్మి, శ్రావణి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# రికార్డులు ట్యాంపరింగ్ చేసినందుకు

## పాత తహశీల్దార్ అరెస్ట్



భీమునిపట్నం : రికార్డులను ట్యాంపరింగ్ చేసిన కేసులో అప్పటి తహశీల్దార్ బి.టి.వి రామారావు ను అరెస్టు చేసినట్లు భీమిలి సి.ఐ వెంకటనారాయణ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ విశాఖపట్టణం నకు చెందిన బడే నర్సింగరావు అనే వ్యక్తి కి భీమిలి మండలం, చేపలుప్పాడ పంచాయతీ సర్వే నంబర్ 31/7 లో28సెంట్ల స్థలం ఉందని అన్నారు. అయితే 2016జనవరి 16న అదే స్థలంను అప్పటి తహశీల్దార్ బిటివి రామారావు కారి సత్తెన్న పెరు మీద మార్పు చేసి అడంగల్ చేసారు. అయితే విషయం తెలుసుకున్న బడేనర్సింగ రావు భీమిలి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కాగా దస్త్రాలు ట్యాంపరింగ్ జరిగినది నిజమే ననీ తేలడంతో బిటివి రామారావు పై 465,468,471 సెక్షన్ల క్రింద కేసులు ధాఖలు చేసినట్లు సిఐ చెప్పారు. కాగా విశాఖ లో నివాస ముంటున్న రామారావు నీ అరెస్ట్ చేసి భీమిలి కోర్ట్ లో హాజరు పరిచినట్లు,న్యాయ మూర్తి 14రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. కాగా విశాఖ కేంద్ర కారాగారానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు భీమిలి సి.ఐ వెంకటనారాయణ తెలిపారు

## రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యత

కొయ్యూరుః రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షులు ఎంవివి.ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తూ చరిత్రలో ఎన్నడూ, ఏ ప్రభుత్వాలు రూపకల్పన చేయలేని బడ్జెట్‌గా ఉంద న్నారు. ముఖ్యంగా బడ్జెట్‌లో ఆరు పథకాలకు రూపకల్పన చేసి రైతులకు అధిక ప్రాధా న్యత ఇచ్చేలా అన్నదాత సుఖీభవ పథకం ప్రత్యేకంగా ఉంద న్నారు.

కావలెను
MATHS FACULTY
VI th X th Class
Evining 6 to 8 PM
TPT Colony,
Seethammadhara
Visakhapatnam - 13
9182876798

# పేదలకు గృహ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం : చినరాజప్ప





పెద్దాపురం : 2020 నాటికి రాష్ట్రంలో పేదలందరికీ ఇల్లు నిర్మించడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. శనివారం పెద్దాపురం పట్టణానికి సంబంధించి వాలు తిమ్మాపురం రోడ్డులో నిర్మించిన అందరికీ ఇల్లు పథకం కింద 1724 ఇళ్లకు గృహ ప్రవేశాన్ని ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందరికీ ఇల్లు-ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇల్లు నిర్మాణం చేపట్టి 2020 నాటికి సొంతింటి కలను నిజం చేస్తారని తెలిపారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలను దృష్టిలో పెట్టుకొని వారి అవసరాల మేరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. నాణ్యమైన అపార్టుమెంట్లు నిర్మించి వాటిలో తాగునీరు, కరెంటు, రోడ్లు, రేషన్‌షాపు, మార్కెట్, అంగన్వాడీ కేంద్రం, స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని, ఇదొక టౌన్‌షిప్‌ల వుంటుందని తెలిపారు. అర్హత వుండి ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా వారికి సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఆర్థిక భారం వున్నప్పటికి సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెనుకంజ వేయడం లేదని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేపట్టడానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని మంత్రి కోరారు.

ఈ కార్యక్రమానికి ముందు శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్‌లో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను, అంకయ్యపేటలో కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను మంత్రి ప్రారంభించారు. అనంతరం పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో 7 కోట్ల 30 లక్షలతో ఆసుపత్రి అదనపు పడకల గదులను మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కురిపూరి రాజు, జి.వి.ప్రసాద్, బి.సుధాకర్ పట్నాయక్, బి.ఆర్. ఆత్మ ఛైర్మన్ కె.రాంబాబు, బొడ్డు బంగారుబాబు, డా.రవికాంత్, వార్డు కౌన్సిలర్‌లు, రాఘవయ్య, రంది సత్యనారాయణ, తూతిక రాజు, లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోలవరాన్ని సందర్శించిన టిడిపి నాయకులు, రైతులు



అన్నవరం: తూ.గో జిల్లా టిడిపి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టును సందర్శించేందుకు అన్నవరం పరిసర గ్రామాల నుంచి టిడిపి కార్యకర్తలు రైతులు అధిక సంఖ్య లో తరలి వెళ్లారు.

ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పర్వత సురేష్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు తెలుగు ప్రజల జీవనాడి అని తెలిపారు. అదేవిధంగా డీసీసీబీ చైర్మన్ వరుపుల.రాజా మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ ఆదాయాన్ని రెండింతలు చేసి కరువు రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా చే పట్టుతున్నారని తెలిపారు. పోలవరాన్ని సంద ర్శిం చిన వారిలో టీడీపీ నాయకులు రాజాల .చిట్టిబాబు, పలివెల.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా మండలి సమావేశం

కాజులూరు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి ఎం. కృష్ణరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగానే జరిగింది. ఈ సమావేశానికి 19 శాఖల అధికారులు హాజరుకావలసి ఉండగా 11 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మండల పంచాయతీ రాజ్ ఎఇ కె. సుస్మిత మండలంలో విధులకు హజరై మండల సర్వసభ్య సమావేశంకు, హాజరు కాకపోవడంపై ఎంపిపి కృష్ణరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశానికి హాజరుకాని 8 శాఖల అధికారులకు నోటీసులు జారీ చేయవలసిందిగా ఎంపిడిఓ పి.వి.వి. సత్యనారాయణను ఆదేశించారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. బంధనపూడి ఎంపిటిసి సలాది పుష్పవతి ప్రజాసమస్యలపై అధికారులను నిలదీశారు. సరైన సమాధానం అందించకపోవడంతో సభ్యులు అధికారులుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత వారోత్సవాలు



ములగాడ: కోరమండల్ కర్మాగారం ఆధ్వర్యంలో శనివారం రహదారి భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాపురం ట్రాఫిక్ విభాగ సిఐ వాసుదేవరావు పాల్గొని ప్రారంభించారు. ఈ వారోత్సవాలను సుమారు 150 మంది ట్రక్ డ్రైవర్లు పాల్గొని ప్రమాదాల భారీ నుంచి తీసుకోవలసిన జాగ్రత్తలను దృశ్యరూపంగా ప్రదర్శించి పలువు మన్ననలు పొందారు వీరిలో రహదారి భద్రతలో నైపుణ్యం కనిపించిన డ్రైవర్లకు ట్రాఫిక్ సీఐ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో కోరమండల్ సీనియర్ జీ ఎం రంగకుమార్ జి ఎం రాజేష్ ఫాస్ట్ యా లక్ష్మీనారాయణ సేఫ్టీ ఆఫీసర్ రాజశేఖర్ సి ఎస్ నారాయణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## బహుజన సమాజ్ పార్టీకి రాజీనామా చేసిన: పెద్దిరెడ్ల నానాజి



ములగాడ: పశ్చిమ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీకి (బిఎస్పి) ఎన్నో సేవలు అందించి పార్టీ పటిష్టంనికి ఎంతో కృషిచేసి నియోజకవర్గ కన్వీనర్ పెద్దిరెడ్ల నానాజి పార్టీకి రాజీనామా చేశారు.

ఆయన శ్రీహరిపురంలో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బహుజన సమాజ్ పార్టీకి మనుగడ లేకపోయినా గత 7 సంవత్స రాల నుంచి పార్టీ జెండా ఈ ప్రాంతంలో ఎగిరేలా పలు కార్యక్రమాలు సేవా కార్యక్రమాలు పార్టీ తరపున చేశానని అదే కాకుండా పార్టీ నాయకు లతో కలిసి పనిచేసి ఈ ప్రాంతంలో పార్టీకి మరింత గౌరవం పెరిగేలా జాతీయ పార్టీని సత్తాని చూపిన నాకు పార్టీలో సరైన స్థానంతో పాటు నన్ను అవమాన పరిచేలా ఈ మధ్యకాలం లో బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి జన్మదిన వేడుకల్లో నన్ను వేదిక మీదకు పిలవకుండా అవమానపరిచి నందు వల్ల నేను మనస్తాపం చెంది అదేవిధంగా నా ప్రమేయం లేకుండా ఈ నియోజకవర్గంలోనే మరొకరికి పదవిని ఇచ్చినందువలన నాకు మరింత బాధ కలిగి కలిగి ఈ పార్టీకి రాజీనామా పత్రాన్ని ఇస్తున్నట్లు వెల్లడించారు.

## గురువు దైవ సమానం : ఎమ్మెల్యే వాసుపల్లి

### జ్ఞానాపురం సేక్రెడ్ హార్ట్ బాలికల పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



విశాఖపట్నం: ఏ దేశమేగినా విద్యనందించిన గురువును మరువరాదని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. విశాఖ దక్షిణం 44వ వార్డు జ్ఞానాపురం సేక్రెడ్ హార్ట్ బాలికల పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక అపురూపంగా అద్భుతంగా జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులందరూ కలుసుకొని అనాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకొని సంతోషంగా గడపడం అద్భుతంగా ఉందన్నారు. గురువు దైవంతో సమానమని మంచి జీవితాన్ని అందించిన గురువులను సత్కరించడం మన అదృష్టం అన్నారు. అనంతరం అందరూ కలిసి బోజనం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీ మాధవ్ చేతుల మీదుగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

## నేడు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

యలమంచిలి: యలమంచిలి పట్టణంలో కోటి 60 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మాణం చేపట్టిన మున్సినల్ కార్యాలయం, 46 లక్షల రూపాయలతో చేపట్టిన అన్న క్యాంటిన్, 15 లక్షలతో చేపట్టిన హైస్కూలు భవనాల ప్రారంభోత్సవాలు, రెండు కోట్లతో చేపట్టనున్న కాపు సంక్షేమ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన ఆదివారం జరగనున్నాయని మున్సినల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జెడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్‌లు హాజరుకానున్నారని తెలిపారు.

## సంక్షేమ పథకాల ఘనత టీడీపీదే

### – మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి



యలమంచిలి: తెలుగుదేశం పార్టీ స్థాపించి నప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ లక్ష్యంతో స్థాపించారో అదే లక్ష్యంతో పేదవాడికి కూడు, గూడు, గుడ్డ కల్పిస్తూ జీవనోపాధి కల్పించేందుకు పలు సంక్షేమ పథకాలు ఇస్తూ దేశంలోనే తెలుగుదేశం పార్టీ అగ్రస్థానంలో నిలిచిందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన ఎన్టీఆర్ గృహ కల్పన ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో కొత్తపాలెం గ్రామంలో ఎన్టీఆర్ సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం రమాకుమారి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీ రామారావు తదనంతరం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీని లక్ష్యాన్ని చేదిస్తూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలకు తగినట్లుగా కొత్తగా సంక్షమ పథకాలు పెట్టి ప్రజాధరణ పొందిన పార్టీగా తెలుగుదేశం పార్టీ ఎదిగిందన్నా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొఠారు సాంబ, కమిషనర్ బాకూరి ప్రసాద్‌రాజు, ఆర్వో పట్నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారి గౌర్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కౌన్సిలర్ పడాల సూరిబాబు, టీడీపీ నాయకులు పిళ్లా గంగాధర్, పి. ఆదిబాబు, వెంకట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



విశాఖపట్టణం జిల్లా అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ సీసాగుడ గ్రామంలో గృహప్రవేశం సందర్భంగా ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గిరిజన సంక్షేమ మరియు ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు కిడారి శ్రావన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రవేశపెట్టిన గృహములు ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు, ఎంపిపి గుజ్జెల పైడితల్లి జడ్పి వైస్ చైర్మన్ కొట్యాడ అప్పారావు, హౌసింగ్ ఇఇ, సిబ్బంది ఏఈఈ కె రవిబాబు హౌసింగ్ వర్కు ఇనస్పెక్టర్‌లు నాగేశ్వరరావు రాంబాబు దేవుడు తెలుగుదేశం పార్టీ నాయకులు యం.జొగులు, భీం పోలుశివ, సమర్థి దొన్ను, దయానిధి, సారా దొన్ను, కృష్ణ, రాజు, చిరంజీవి, కార్యకర్తలు, ప్రజానీకం పాల్గొన్నారు.

## 24 నుంచి మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు

### ఇండియన్ జిమ్ ఆధ్వర్యంలో నిర్వహణ గోడ పత్రిక ఆవిష్కరణ



విశాఖపట్నం: అక్కయ్యపాలెంలో ఉన్న ఇండియన్ జిమ్ క్లాసిక్స్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుండి మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ ఛాంపియన్‌షిప్ కోసం రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన పలువురు బిల్డర్లు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికను శనివారం జిమ్ కార్యాలయంలో అతిధుల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జర్నలిస్టుల జాతీయ సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడ గంట్ల శ్రీనుబాబు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ పోటీలు అక్కయ్యపాలెం మహారాణిపార్లర్ ఎదురుగా నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ట్రోఫీలతోపాటు రూ. 2.50 లక్షల నగదు బహుమతులు, ఇతర ప్రోత్సాహకాలు అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిమ్‌కు చెందిన పలువురు బిల్డర్లు పాల్గొన్నారు.

## ఒత్తిడికి గురి కావద్దు: డిఎస్పీ రామారావు

### వేగం కన్నా ప్రాణం మిన్న




కాకినాడ/గండేపల్లి : వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్ ఒత్తిడికి గురికాకుండా నిర్ధేశించిన వేగంలో వాహనాలు నడిపితే సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చునని పెద్దాపురం డిఎస్పీసిహెచ్ రామారావు సూచించారు. శనివారం పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకర్ ఆధ్వర్యంలో సూరంపాలెం ఆదిత్య విద్యా కళాశాలలో డ్రైవర్‌లకు భద్రతా వారోత్సవాలు పురస్కరించుకొని రహదారి భద్రతా నియమాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పెద్దాపురం డిఎస్పీ సి.హెచ్ రామారావు, మాట్లాడుతూ డ్రైవర్లకు పలుసూచనలు సలహాలు అందించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, బస్సు కండిషన్ ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. అనంతరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల బస్సులకు వేగ నియంత్రణ కొరకు స్పీడ్ గవర్నర్స్ అమర్చడం జరిగిందన్నారు. ప్రతీ డ్రైవర్ వేగంకన్నా ప్రాణం మిన్న అనే నినాదాన్ని పాటిస్తూ నడపాలన్నారు. ముఖ్యంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. డైరెక్టర్ డా.ఎమ్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ ఆదిత్య యాజమాన్యం రవాణా విషయంలో అత్యంత శ్రద్ధ వహిస్తూ ఎప్పటికప్పుడు డ్రైవర్లకు వైద్యపరీక్షలు నిర్వహిస్తూ తగు జాగ్రత్తలు తీసుకొంటుందని, అంతే కాకుండా ప్రతీ సంవత్సరం ఉత్తమ డ్రైవర్లకు నగదు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందని వివరించారు. అనంతరం డ్రైవర్లకు హెల్త్ కార్డు లను ముఖ్య అతిథుల చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎమ్. శ్రీనివాసరెడ్డి తెలియజేసారు.ఆదిత్య సిబ్బంది చిట్టిబాబు,ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై దాడులను అరికట్టాలి, నిర్భయ చట్టాన్ని బలోపేతం చేయాలి




విశాఖపట్నం : నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో ఈ రోజు ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్టర్ ఆఫీస్ దగ్గర గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థినీ విద్యార్థులు సేవ్ ఉమెన్, వుయ్‌వాంట్ జస్టిస్ అని నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు గౌడ్ యాత మాట్లాడుతూ అంధ్రప్రదేశ్‌లో దళితుడిని ప్రేమించిన దానికి అమ్మాయి గొంతునుతిమి హత్యచేశారని అదేవిధంగా తెలంగాణలో ప్రేమించలేదని మారణాయుధాలతో దాడిచేసి చంపేశారని ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగు తున్నాయని మహిళలను మోసాలకు గురిచేస్తు న్నారని నిర్భయ చట్టాన్ని బలోపేతం చేసి ఆంధ్రప్రదేశ్‌లో కూడా షీటీమ్స్ ఏర్పాటుచేసి మహిళల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ మహిళా విభాగం అధికార ప్రతినిధి మంచ నాగ మల్లేశ్వరి, ఆంధ్రప్రదేశ్ యూనివర్సి టీస్ ఎన్ఎస్ యుఐ కన్వీనర్ అబ్రహం సుమంత్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## ఘనంగా రత్నగిపై సరస్వతీదేవి పూజ

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యన్నారాయ ణ స్వామివారి దేవస్థానంలో శ్రీపంచమి మహాసరస్వతి పూజ ఘనంగా వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. ఈ సరస్వతి పూజకి శ్రేష్ట విద్యా భవన్ స్కూల్ మరియు శ్రీ ప్రకాష్ స్కూల్ వారు సుమారు 4000 పెన్నలను పూజా కార్యక్రమంలో ఉంచారు. ఈ పెన్నలను విద్యార్థిని విద్యార్థుల కు దేవస్థానం వారు పంపిణీ చేసారు.

ఈ పూజా కార్యక్రమానికి అన్నవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థిని విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు దేవస్థానం పిఆర్వో తులా. రాముడు, సూపరిం టెండెంట్ అనకాపల్లి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల రక్షణే భవితకు రక్షణ



విశాఖపట్నం: నేటి బాలలే రేపటి పౌరులు అట్టి విద్యార్థుల రక్షణార్థం శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏ.జి.యమ్. ఎమ్.వి. సురేష్, రీజనల్ ఇన్‌ఛార్జ్ ఎమ్.డి. అహ్మద్ ఆలీ, శ్రీ చైతన్య విద్యా సంస్థ ప్రిన్సిపాల్ కె.వి.పి. సూర్యనారాయణ ఎమ్. జ్యోతి ఆధ్వర్యంలో శ్రీ చైతన్య విద్యాసంస్థ మారికవలస యందు అనేక పాఠశాలల డ్రైవర్లతో సమావేశము జరిగినది.

రోడ్ల భద్రతా వారోత్సవముల సందర్భముగా డిప్యూటి రవాణా శాఖ కమీషనర్ డా॥ ఎస్. వెంకటేశ్వర రావు ముఖ్య అతిథిగా, రిటైర్డ్ ఆర్.టి.ఒ. ఎ.హెచ్.ఖాన్ గౌరవ అతిథిగా విచ్చేసిరి. విద్యార్థులు పువ్వుల వంటి వారు వేగము కాదు. భద్రముగా గమ్యం చేర్చడం ముఖ్యం. అన్నిటికన్నా విలువైన ఎన్నో ప్రాణాలు మీ చేతిలో ఉంటాయి. వాహనములను నడుపు సమయంలో అప్రమత్తులై ఉండాలి. ట్రాఫిక్ ఎవరూ గమనించడం లేదు కదా అని నియమాలను మీరకుండా నడిపితే మీ ప్రాణాలు మీ చేతుల్లో ఉన్న ఎందరో ప్రాణాలను ప్రమాదాల బారిన పడకుండా కాపాడగలుగుతారు.

జీవితంలో ఏది పోయినా సంపాదించగలము. కానీ ప్రాణాలను పోతే పొందలేము. ఒక్క క్షణం నిలిచి ఆలోచించి వాహనాలు నడపండి. " నిదానమే ప్రధానము" అనే నానుడి జ్ఞప్తి యందుంచు కొనండి. ప్రతి ఒక్కరూ ఎవరికి వారు జాగ్రత్తగా వాహనములను నడిపినచో అనేక ప్రమాదాలను జరగకుండా అరికట్టిన వారమౌతాము. మీరు మీ కుటుంబ సభ్యులే కాక అందరూ సుఖశాంతులతో జీవించగలరు. ఈ ప్రసంగానికి అనేక పాఠశాల డ్రైవర్లు స్ఫూర్తిని పొంది విశేషంగా స్పందించిరి.

# అన్నపూర్ణ దేశంలో...అక్షయపాత్ర

**ఒక ఆశయం నిరంతరం...ఉచ్ఛ్వాశిస్తూ...ఒక ఆవేదనపై విరామమెరుగక పరిశ్రమిస్తూ..ఒక యుద్ధాన్ని ..జీవితానికి ఒక అర్ధాన్ని వెదుకుతూ ....ఆ యాత్రలో... ఆకలిపై దండయాత్ర చేయాలన్న సంకల్పంతో... సైనికుడిలా కదిలాడు. ఒక రోజూ..రెండురోజులూ కాదు.అప్పుడే వారాలు..నెలలు..ఋతువులూ, మారుతున్నా.. కాలంతో సమానంగా పరిగెడుతూ పేదవారి.. అన్నార్తుల ఆకలిపై గెలుపుకోసం పరిభ్రమిస్తూ... పయనం సాగిస్తున్నాడు..అతని పేరే డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్..విజయనగరం.. బాబామెట్ట నివాసి. రచయిత..కవి...సంఘసేవకులు...ఇంకా ఎన్నో...**

అంతా మా 'అన్న' అని గుండెమీద చేయివేసుకునే చెబుతారు. రోజూ తన రాక కోసం ఎదురుచూస్తుంటారు. వారి కళ్ళు వెదుకులాట మొదలైయ్యేలోపే...వారిని చేరి హృదయానికి హత్తుకుని వారిముందు ఆకలికి విస్తరిలా మారుతాడు. అందరికీ దానిపేరు అన్నం అయితే..అది ఖలీల్‌బాబు చేతి నుంచి వచ్చాక ప్రసాదంగా మారుతుంది. అందుకే బాబూ ప్రసాదం పెట్టు అంటారు. తనొచ్చేలోపే బారులుతీరి కూర్చుంటారు. నగరం నాలుగు దిక్కులా ఉన్న అన్నార్తులంతా వారి వారి చోటుల్లోనే ఉంటారు. ఒక చిన్న బండిలో కావలసిన ఆహార పదార్థాలు వేసుకుని కదుల్తాడు తాను. ఇద్దరో...ముగ్గురో కుర్రాళ్ళు...మరో జత పెద్దోళ్ళు వెంట మేమూ వస్తామని అనగానే వారితో కలిసి బయలుదేరుతాడు. ముందు డెంకాడ రోడ్డు మీద బిచ్చగాళ్ళు...మానసిక వైకల్యం ఉన్న వారికి తనొక అమ్మ లా తినిపిస్తాడు. తర్వాత అంబటిసత్రం బయలుదేరతాడు. అక్కడ అరా..కొర ఉన్న బిచ్చగాళ్ళకు ఆహారం అందిస్తాడు. అక్కడనుంచి నేరుగా రైల్వేస్టేషన్ ముందు బండి ఆగుతుంది. అంతే అప్పటికే 50 మంది వరకు వరసలు కట్టి కూర్చుంటారు. చకచకా విస్తళ్ళు పడతాయి. వెంటనే వేడివేడి భోజనం హాట్‌పేక్ నుంచి అతని చేతులమీదుగా వడ్డించబడుతుంది. కొందరు మారం చేసి తింటారు. కొందరు ఆబగా లాగించేస్తారు. కొందరు రేపుకూడా వస్తారని ధీమాగా ఆరగిస్తారు. తినిన తర్వాత ఆకులను వారి చేతిలోంచి చిన్న గోనె సంచిలోకి తీసుకుని వారికి రేపటి ఉదయం నేనున్నానుగా అనే భరోసా నిచ్చి కదుల్తాడు. అక్కడితో ఆగరు. మరలా తన నివాసానికి (బాబామెట్ట) విచ్చేసి



అక్కడ అన్నసమారాధనలో పాల్గొంటారు. అదీ వారి చేతి చలువే. ఇలా ఇప్పటికి ఐదునెలలు కావచ్చింది. అది గురుతుల్యులు హజరత్ ఖాదర్ వలి(ర.అ) వారి ఆజ్ఞగా చెబుతారు. తండ్రి సూఫీ మహాత్మ అతావుల్లా షరీఫ్ షా ఖాదరీ బాబా వారి బాట...మాట... అదే తనకు శిరోధార్యం. వారిలాంటిదే ఈ ఔదార్యం. విధి వక్రించిన విగతజీవులకు...వైకల్యానికి వైద్యం అందించి తన వెంట తీసుకువెళతాడు. వారిని తాను నిర్మించిన 'ఆశ్రమం'లో పెట్టి కోలుకున్నాక..వారి ఇష్టం మేరకు అక్కడే ఉంటే జీవితానికి ధీమాను ఇస్తాడు. ఇప్పటికి 15 మంది వృద్ధులు తన ఆశ్రయం పొందుతున్నారు. వారిలో ఎవరికైనా పింఛను అర్హత ఉంటే ప్రభుత్వం ద్వారా ఆ సాయం వారికి వచ్చినా...తాను మాత్రం వారి నుంచి పైసా ముట్టడు. వారి అకౌంటులో వేసి





తాను మామూలు మనిషిగా వారిని తన కుటుంబంలో ఒకరిగా చూసుకుంటాడు. ఇక పిల్లలు కనిపిస్తే...వారు అనాధలైతే వెంటనే అధికారులతో మాట్లాడి తాను నడుపుతున్న అనాధ ఆశ్రమంలో చోటు ఇస్తాడు. విద్యార్ధులకు వివిధ అంశాల్లో పోటీలు పెట్టి విజేతలను ప్రోత్సహిస్తూ...వారి ఆనందంలో తానొక కన్నీటి బాష్పం అవుతాడు. ఎవరికి కావాలండీ! ఇలాంటి వాళ్ళు అన్నారంటే చాలు చాలా మధనపడతాడు. మనం వారికోసం చేస్తే...వారు అలాంటి వారి కోసం ఆలోచిస్తారు. జాతులు రెండే ఆడ...మగ...అంటూ అన్ని కులాలని..వర్ణాలని...తుంగలో తొక్కమని హెచ్చరిస్తాడు. అవి చూసి ఎందరో స్ఫూర్తి పొంది రోజూ ఎన్నో మెసేజ్‌లు పంపిస్తూ తామూ... ఆ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామని చెప్పడంతో రెట్టింపు ఉత్సా హంతో వారిని పలకరించి తన అక్కున చేర్చుకుంటాడు. అందుకే తన దగ్గరకు వచ్చే అవార్డులు..రివార్డు వాటి అర్హతని అవే ప్రశ్నించుకుంటాయి. అయినా వారి దగ్గరుండాలన్న మక్కువతో ఇప్పటికే 23 అవార్డులు చేరాయి. డాక్టరేట్ తానెక్కడ ఉన్నాడో అని వెదుక్కొని తన పేరు ముందు పావురంలా వాలింది. తనొక బాసటగా నిలవాలన్న ఆ తపనకు అంతా జోహార్లు పలకడమేకాదు..వీలైతే ఆ సేవలతో మనం తరిద్దామని కొందరు ఆతృత పడతారు. ఇది నిరంతర క్రతువు...ఇదే మానవతా మూర్తికి ధాతువు.

## ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి: వంశీకృష్ణ శ్రీనివాస్



విశాఖపట్నం: 16వ వార్డ్ లోగల మంగాపురం కాలనీలో గడప గడపకు నవరత్నాలు కార్యక్రమంలో మన తూర్పు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త శ్రీనివాస్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి స్థానికులను స్వయంగా కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, నవరత్నాలు తో కూడిన కరపత్రాలు ప్రజలకు అందజేస్తూ వారిని కలసుకుంటూ పాదయాత్ర సాయంత్రం 4.30 నుంచి 8 గంటల వరకు కొనసాగింది. స్థానిక వార్డ్ లొనే నివాసం వున్నందున అందరూ ప్రేమాభిమానాలు తో భారీ ర్యాలి గా పాదయాత్ర కొనసాగింది. ఒక అవకాశం ఎమ్మెల్యేగా ఇవ్వాలని కోరారు.

వైస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఒక అవకాశం ఇచ్చి పార్టీ అధికారంలోకి తేవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక భూత్ నాయకులు సింహాద్రి మరియు ముఖ్య నాయకులు వివిధ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 38వార్డు బూత్ కన్వీనర్లు మీటింగ్



విశాఖపట్నం: 38 వ వార్డు బూత్ కన్వీనర్లు మీటింగ్ విశాఖ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో 38 వార్డు అధ్యక్షులు బొడ్డు. ఎర్రు నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ మీటింగ్ కి ముఖ్య అతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు 38 వార్డు అధ్యక్షులు బొడ్డు. ఎర్రు నాయుడు, యన్. రవికుమార్, వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వార్డు బూత్ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కలల సాకారం కోసం..



నటిస్తున్న పాత్రకు ఎంతవరకు న్యాయం చేయగలనన్నదే తనకు ముఖ్యమని అంటున్నది రకుల్‌ప్రీత్‌సింగ్. సెట్స్‌లో అడుగుపెట్టిన తర్వాత తనను తాను పూర్తిగా మర్చిపోతానని, ప్రతి క్షణం పాత్ర గురించి ఆలోచిస్తూ అందులో ఇమిడిపోయే ప్రయత్నం చేస్తానని చెబుతున్నది. రకుల్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ సినిమా చిత్రీకరణలో నిరంతరం ఆశావాహ దృక్పథంతో ఉంటాను.

మనం సంతోషంగా ఉంటే ఆ ప్రభావం మనం చేసే పనిపై ఖచ్చితంగా ఉంటుందని నమ్ముతాను. మనసులో ఎంత ఒత్తిడి ఉన్నా అది ముఖంపై ప్రతిఫలించకుండా నిర్మలంగా ఉండటానికే ప్రయత్నిస్తాను. ఓ సన్నివేశంలో బాగా నటించానంటే ఆ రోజంతా సంతోషంగా ఉంటుంది. బాగా రాకపోతే డీలా పడిపోతుంటాను. ఆ బాధను ఆ రోజుకే పరిమితం చేస్తాను. మరుసటి రోజును కొత్తగా మొదలుపెడతాను అని తెలిపింది. సినిమాల నుంచి తీరిక దొరికితే స్నేహితులతో కబుర్లు చెబుతానని అంటోంది రకుల్. జీవితంలోని ప్రతి క్షణాన్ని నాకు నచ్చినట్లుగా మలచుకోవడానికి ప్రయత్నిస్తాను. చిన్న చిన్న ఆనందాలకు విలువనిస్తాను. స్నేహితులతో కాలక్షేపం, కుటుంబ సభ్యులతో గడిపే కొద్దిపాటి సమయమే నాలో ఎక్కువ సంతృప్తినినింపుతుంది. కలల ప్రపంచంలో విహరించడమే కాదు వాటిని సాకారం చేసుకోవడానికి నిరంతరం కష్టపడుతుంటాను అని తెలిపింది.

# చిత్రభాను

### ఆస్కార్ లైబ్రరీకి

## సోనమ్ సినిమా



తనదైన నటనతో బాలివుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనిల్ కపూర్ కుమార్తె సోనమ్ కపూర్ ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. నీరజ సినిమాలో తన నటనకు జ్యూరీ విభాగంలో ఉత్తమ నటి అవార్డు సైతం సొంతం చేసుకుంది. ఇప్పుడు తనకు మరో అరుదైన గౌరవం దక్కనుంది. తను నటించిన ఏక్ లడ్‌కీ కో దేఖా తో ఐసా లగా చిత్రాన్ని ఆస్కార్ లైబ్రరీలో చేర్చనున్నారు. మూవీకి సంబంధించిన ఓ కాపీని అందించాలని.. దాన్ని లైబ్రరీ కోర్ కలెక్షన్స్‌లో ఉంచుతామని అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ సంస్థ సినిమా నిర్మాతలను కోరిందట. ఈ వార్త తెలిసిన సోనమ్ కపూర్ ఆనందం వ్యక్తం చేశారు. నేను మా నాన్నతో నటించిన మొదటి సినిమా ఇది. అందులోనూ ఓ మంచి సందేశం ఉన్న సినిమా. ఈ సినిమాను ప్రేక్షకులు ఎంతో ఆదరించారు. ఇప్పుడు ఈ సినిమా ఆస్కార్ లైబ్రరీలోనూ ఉంచడం ఆనందాన్ని కలిగిస్తోంది అంటూ సోనమ్ తన సంతోషాన్ని వ్యక్తం చేసింది.

స్వలింగ సంపర్కం అనే అంశంతో తెరకెక్కిన ఈ సినిమాలో టాలీవుడ్ భామ రెజీనా, అనిల్ కపూర్, రాజ్‌కుమార్ రావు, జూహీ చావ్లా కీలక పాత్రల్లో నటించారు. షెల్లీచోప్రా ధార్ దర్శకత్వం వహించారు. గతంలో ఇలాంటి సబ్జెక్టు ఆధారంగా దోస్తానా సినిమా వచ్చిన విషయం తెలిసిందే.

## ఆయన స్టైలే వేరబ్బా...!



ఏ సందర్భంలోనైనా కొత్తగా చేయడంలో తలైవా రజనీకాంత్ తరువాతే ఎవరైనా.. అందులో ఆశ్చర్యమే లేదు. తాజాగా తన పెద్దకూతురు సౌందర్య నిశ్చితార్థ వేడుకలో వచ్చిన అతిథులకు ఒక వినూత్న కానుకను అందించారు. నిమ్మ విత్తనాలను ఒక ప్యాకెట్‌లో వేసి అందజేశారు. దానిపై ఇలా రాసి ఉంది.. వీటిని నాటండి లేదా పారేయండి ఆరోగ్యాన్ని పంచే చెట్లుగా ఎదుగుతాయి ఇలా రజనీ పర్యావరణంపై తనకున్న ప్రేమను, బాధ్యతను తెలియజెప్పారు. శుక్రవారం సౌందర్య, విశాగన్ నిశ్చితార్థం చెన్నైలోని కోడంబాకం రాఘవేంద్ర మండపంలో జరిగింది. ఈ నెల 11న సిటీ లీలా ప్యాలెస్‌లో వివాహ వేడుక జరగనుంది.

## నాతో పెట్టుకుంటే..!



బాలీవుడ్ నటి కంగనారనౌత్‌ది దూకుడు స్వభావమని చెబుతారు. ముక్కుసూటితనంతో పాటు ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన అభిప్రాయం వెలిబుచ్చుతూ తరచు వివాదాల్లో చిక్కుకుంటున్నదీ హిమాచల్ సొగసరి. తాజాగా బాలీవుడ్ ప్రముఖులపై ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కొందరు తనను లక్ష్యంగా చేసుకుని వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని, వారందరి బండారం బయటపెడతానని కంగనా హెచ్చరించడం బాలీవుడ్ చిత్రసీమలో హాట్‌టాపిక్‌గా మారింది. ఆమె నటించిన మణికర్ణిక విజయాన్ని పురస్కరించుకొని కంగనా పాత్రికేయులతో ముచ్చటించింది. మణికర్ణిక ప్రచార కార్యక్రమాలకు పరిశ్రమలోని సెలబ్రిటీలు ఎందుకు రావడం లేదన్న ప్రశ్నపై కంగనా మండిపడింది. కెరీర్‌లో ఇప్పటికే నాలుగుసార్లు జాతీయ అవార్డులు స్వీకరించాను. మణికర్ణికతో దర్శకురాలిగా సత్తాచాటాను. నాకు మరొకరితో ప్రచారం చేయించుకునే అవసరం ఏముంది? పరిశ్రమలో నాకు వ్యతిరేకంగా ఓ బృందం పనిచేస్తున్నది. నేను వారితో స్నేహంగా ఉండటానికే ప్రయత్నిస్తున్నాను. కానీ వారు మాత్రం నాపై ద్వేషాన్ని పెంచుకుంటున్నారు.




# 12న గీతం క్రికెట్ స్టేడియం ప్రారంభోత్సవం

## బీసీసీ సెలక్షన్ కమిటీ చైర్మన్ రాక



సాగర్‌నగర్‌: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో దాదాపు ఆరు కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు గల క్రికెట్ స్టేడియంను ఈ నెల 12వ తేదీన భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్.ఎస్.కె. ప్రసాద్ ప్రారంభించ నున్నారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి. బాలాజీ తెలిపారు. దాదాపు 6 వేల మంది ప్రేక్షకులు కూర్చీనే గ్యాలరీలతో పాటు మూడు అంతస్థులలో వి.ఐ.పి.లు, క్రీడా ప్రతినిధులు, పాత్రికేయులు కూర్చుని పోటీలను వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు క్రికెట్ స్టేడియంలో ఉన్నాయన్నారు.

క్రికెట్ క్రీడాకారులకు డ్రెస్సింగ్ రూమ్‌తో పాటు గ్రీన్‌ఫీల్డ్, టర్ఫ వికెట్, ఆధునిక స్కోరుబోర్డు స్టేడియం స్థాయిని పెంచేవిగా నిర్మించామన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల అఖిల భారత స్థాయి క్రికెట్ పోటీలతో పాటు నగరంలో జరిగే అంతర్జాతీయ క్రికెట్ పోటీల సమయంలో వివిధ దేశాల జట్లు ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుకూలమైన ప్రమాణాలతో గీతం క్రికెట్ స్టేడియం ను అభివృద్ధి చేశామన్నారు.



విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గము 26 వ వార్డ్ లో వైకాపా నియోజకవర్గం సమన్వయకర్త డాక్టరు పీవీ రమణమూర్తి ఆద్వర్యంలో రావాలి జగన్ కావాలి జగన్ కార్యక్రమం జరిగింది.వార్డ్ నాయకులతో కలిసి ఇంటిఇంటికి వెళ్లి జగనన్న నవరత్నాలు పై అవగాహన తెలియజేసారు ఈ కార్యక్రమం లో రాష్ట్ర అధికార ప్రతినిధి జానువేస్లీ వార్డు అద్యక్షులు అలుపన కనక రేడ్డి, బోని దేవ తదితరులు పాల్గోన్నారు.

# పేద వధూవరులకు పెళ్లి కానుక

### వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె.రాజు



విశాఖపట్నం: విశాఖ ఉత్తర నియోజకవర్గలో పెళ్లి చేసుకున్న పేద జంటకు పెళ్లి కానుకగా రూ. 5,000 నగదు బహుమతిగా ఇవ్వనున్నట్లు వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రకటించారు. ఈ సందర్భంగా మొదటగా శనివారం 39వ వార్డుకు చెందిన నూతన వధూవరులు హైమావతి, విశ్వాంతకుమార్‌లకు రూ. 5,000 రూపాయిలు ధన సహాయం చేశారు.

ఈ కార్యక్రమంలో వైస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్తమ విద్యార్థులుగా రాణించాలి







## ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాంశాలు





విశాఖపట్నం: డివైన్ టచ్ ప్లే స్కూల్ ఎనిమిదవ వార్షికోత్సవాన్ని వుడా చిల్డ్రన్స్ ఎరినా థియేటర్‌లో ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంచూరియన్ యూనివర్సిటీ ఉప కులపతి జి.ఎస్.ఎన్.రాజు హాజరై జ్యోతిని వెలిగించి ప్రారంభిoచారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు బాగా చదువుకొని ఉత్తమ విద్యార్థులుగా రాణించాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని హితవు పలికారు. డివైన్ టచ్ ప్లే స్కూల్ విద్యార్థులకోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసిస్తూ మీ ఉన్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. డివైన్ టచ్ ప్లే స్కూల్ ప్రిన్సిపల్ నేహాదాస్ మాట్లాడుతూ ఉత్తమ విలువలతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు. విద్యతోపాటు భక్తిని, పెద్దల ఎడల గౌరవాన్ని అలవరుస్తున్నట్లు పేర్కొన్నారు. గౌరవ అతిథిగా ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షులు సాంబదాస్, ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రథమ నియోనాటోలోజి వైద్యులు లక్ష్మణ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. డివైన్ టచ్ ప్లే స్కూల్ ఎనిమిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక నృత్యాంశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివైన్ టచ్ ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ నేహాదాస్, ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షులు సాంబదాస్, ఇస్కాన్ పిఆర్ఓ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, డివైన్ టచ్ ప్లే స్కూల్, ఉపాధ్యాయినిలు, సిబ్బంది నగరానికి చెందిన ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



సింహాచలం : సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారిని శనివారం వివిద ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు స్వామి వారిని దర్శించుకున్న వారిలో మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకోగా, అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మరియు ఎండోమెంట్స్ ఎడ్వైజర్ చెరువు రామకోటయ్య వారి బృందం సమేతంగా దర్శించుకున్నారు. సింహగిరికి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకగా బేడా ప్రదిక్షణ, కప్పస్థంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో అర్చక స్వాములు వీరి గోత్రనామములతో ప్రత్యేక అర్చనలు జరిపారు. తరువాత లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్న వీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలుకగా ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదములు వీరికి అందజేశారు.



# ఎల్ఎస్పీతో బీఎస్పీ పొత్తు..

### హరియాణాలో ఐఎన్ఎల్డీతో పొత్తుకి టాటా

చండీగఢ్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో పోటీ చేయడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్న ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి ఆధ్వర్యంలోని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ).. హరియాణాలో పొత్తులపై కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్డీ)తో పొత్తుకి టాటా చెప్పి, లోక్‌తంత్రా సురక్ష పార్టీ (ఎల్ఎస్పీ)తో కలిసింది. భాజపా రెబల్ ఎంపీ రాజ్‌కుమార్ సైనీ.. ఆ రాష్ట్రంలో ఎల్ఎస్పీ పేరుతో ఈ పార్టీని స్థాపించారు. గత హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో జింద్ నియోజక వర్గంలో ఐఎన్ఎల్డీ నుంచి పోటీ చేసి గెలుపొందిన హరిచంద్ మిద్దా మృతితో ఇటీవల ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో ఐఎన్ఎల్డీ అభ్యర్థే మళ్లీ గెలుస్తారని భావించగా, ఈ సారి ఆ పార్టీకి కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. భాజపా అభ్యర్థి గెలుపొందారు. ఐఎన్ఎల్డీ బలహీనపడుతోందన్న నేపథ్యంలోనే ఆ పార్టీతో బీఎస్పీ మిత్రత్వాన్ని వదులుకున్నట్లు తెలుస్తోంది.

బీఎస్పీ హరియాణా బాధ్యుడు మేఘరాజ్ శనివారం మీడియాతో మాట్లాడుతూ... మా పార్టీ అధినేత్రి మాయావతి సూచనల ప్రకారం ఐఎన్ఎల్డీతో బీఎస్పీ మిత్రత్వాన్ని వదులుకుంటోంది. ఎల్ఎస్పీతో పొత్తు ప్రారంభిస్తోంది అని ప్రకటన చేశారు. తాజాగా కుదిరిన ఒప్పందం ప్రకారం లోక్‌సభ ఎన్నికల్లో ఈ ఇరు పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. రాష్ట్రంలో మొత్తం 10 లోక్‌సభ స్థానాలు ఉండగా, అందులో 8 స్థానాల్లో బీఎస్పీ, రెండు స్థానాల్లో ఎల్ఎస్పీ పోటీ చేయనున్నాయి. అలాగే, రానున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ 35, ఎల్ఎస్పీ 55 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు మేఘరాజ్ తెలిపారు.







డిల్లీ: భారత్ నుంచి వచ్చే దిగుమతులకు ఇచ్చే పన్ను మినహాయింపులను రద్దు చేయాలని అమెరికా భావిస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే దాదాపు 5.6 బిలియన్ డాలర్ల సరుకులపై భారీగా పన్నులు పడే అవకాశం ఉంది. ఇది భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ కానుంది. ఇప్పటికే అమెరికా నుంచి భారత్‌కు ఎగుమతి అయ్యే వస్తువులపై టారీఫ్‌లు, ఛార్జీలు భారీగా ఉన్నాయని అగ్రరాజ్యం అసంతృప్తిగా ఉంది. దీనిపై ఇరు దేశాల మధ్య కొంత వివాదం కూడా జరుగుతోంది. తాజాగా భారత్ సరుకులపై అమెరికా ఛార్జీలు విధిస్తే ఈ వివాదం మరింత జఠిలం కానుంది. 1970 నుంచి జనరలైజ్‌డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్స్ కింద భారత్‌కు మినహాయింపులు ఇస్తోంది. ఇప్పుడు ఆ జాబితా నుంచి భారత్‌ను తొలగించనుంది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్ విషయంలో తీసుకున్న అత్యంత కఠిన నిర్ణయం ఇదే కానుంది.

### మేకిన్ ఇండియా వర్సెస్ మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్

భారత్‌ను తయారీ రంగ దిగ్గజంగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ మేకిన్‌ఇండియా ప్రోగ్రాంను ప్రారంభించారు. చాలా కంపెనీలపై భారత్‌లో తయారు చేయాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది. 2027 నాటికి భారత్‌లో ఈకామర్స్ రంగం విలువ 200 బిలియన్ డాలర్లను దాటుతుందని అంచనా. దీంతో భారత్ ప్రభుత్వం ఈకామర్స్ రంగంలో దేశీయ కంపెనీలకు ఊతం ఇచ్చేలా నిబంధనలు సవరించింది. దీంతో అమెరికా కంపెనీలైన అమెజాన్, వాల్‌మార్ట్‌లకు ఇబ్బందులు మొదలయ్యాయి. అసలే చైనాలో ఇబ్బంది పడిన ఈ కంపెనీలు భారత్‌లో కూడా ఇటువంటి పరిస్థితి తలెత్తడంతో ఒకింత అసంతృప్తిగా ఉన్నాయి. దీనికి తోడు ఇటీవల వీసా, మాస్టర్ కార్డ్‌వంటి కంపెనీలు భారత వినియోగదారుల డేటాను ఇక్కడే నిల్వచేయాలని భారత్ తేల్చి చెప్పింది. మరోపక్క భారత్‌లో స్మార్ట్‌ఫోన్లపై అధిక టారీఫ్‌లతో యాపిల్ ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. ఇవన్నీ అమెరికా ప్రభుత్వ అసంతృప్తికి ప్రధాన కారణంగా మారాయి.



మరోపక్క ట్రంప్ కూడా అమెరికాలో తయారీ రంగానికి ప్రోత్సాహం కల్పించేలా మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అనే నినాదంతో అధికారంలోకి వచ్చారు. దీనిలో భాగంగానే దిగుమతులపై భారీగా టారీఫ్‌లు విధిస్తూ అమెరికాలో ఉత్పాదక రంగానికి ఊతం ఇస్తున్నారు. భారత్‌కు జీఎస్‌పీ మినహాయింపు ఇచ్చే విషయాన్ని పునరాలోచిస్తోంది. ఇప్పటికే ది యూఎస్ ట్రేడ్ రిప్రజేంటేటీవ్ జీఎస్‌పీ లబ్ధిదారుగా భారత్ హోదాపై సమీక్ష నిర్వహించింది. దీనిపై నిర్ణయం ఒకటి రెండు వారాల్లో వెలువడవచ్చుని అక్కడి అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా కామర్స్ సెక్రటరీ విల్బర్ రోజ్ వచ్చే వారం దిల్లీలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఈ కామర్స్ నిబంధనలు, డేటా లోకలైజేషన్‌పై అమెరికా ఆందోళనను భారత్‌కు వెల్లడించే అవకాశం ఉంది. రెండు దేశాలకు లాభదాయకంగా ఉండే వ్యాపార నిబంధనలపై చర్చించే అవకాశం ఉంది.

### 2,000 వస్తువులపై ప్రభావం..

అమెరికా కనుక భారత్‌కు జీఎస్‌పీ హోదాను రద్దు చేస్తే దాదాపు 2,000 రకాల వస్తువలపై అదనపు ఛార్జీల భారం పడనుంది. ముఖ్యంగా భారత్‌లోని చిన్న వ్యాపారాలు, ఆభరణాల రంగం ప్రభావితం కానున్నాయి. ఒక వేళ హోదా రద్దు చేయకుండా.. ఆ హోదాను కుదించినా కొన్ని రకాల వస్తువులపై భారం తప్పదు.









Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com